కాలాన్ని వృథాగా
గడుపుకుంటూ పోతే
గతం అవుతుంది
గెలుచుకుంటూ పోతే
చరిత్ర అవుతుంది

DD9 వార్త
తెలుగు దినపత్రిక

## వడగళ్ళ వాన, ఈదురు గాలులతో యాసంగి పంట నష్టం..

- రైతులకు ఎకరాకు రూపాయలు 25 వేల చొ ప్పన ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలి.
- ఆదిలాబాద్ జిల్లా రైతుస్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న డిమాండ్.




సంపుటి : 01 సంచిక : 215 హైదరాబాద్, మార్చి, గురువారం 26, 2026 పేజీలు : 08 వెల : 3.00

## దాడులు కొనసాగిస్తూనే ఉంటాం

యుద్ధంపై ఇరాన్ కీలక వ్యాఖ్యలు
ప్రత్యర్థి పశ్చాత్తాపం వరకు యుద్ధం ఆగదు
అమెరికా, ఇజ్రాయెల్‌లకు తీవ్ర హెచ్చరిక
చైనా–ఇరాన్ చర్చల్లో కీలక వ్యాఖ్యలు
గల్ఫ్ దేశాలపై డ్రోన్ దాడులు తీవ్రతరం
కువైట్ విమానాశ్రయం వద్ద అగ్నిప్రమాదం
అమెరికాపై ఇరాన్ సైనికాధికారుల విమర్శలు
శాంతి చర్చలపై
అనిశ్చితి, అంతర్జాతీయ ఆందోళన

**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**
మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రమవుతున్నాయి. ఒకవైపు యుద్ధాన్ని ముగించేందుకు చర్చలు కొనసాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు ప్రకటిస్తుండగా, మరోవైపు ఇరాన్ నుంచి వస్తున్న ప్రకటనలు పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ చర్యలకు ప్రతీకారం తీర్చుకునే వరకు తమ దాడులు ఆగవని ఇరాన్ స్పష్టం చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తాజా ప్రకటనలో ఈ విషయాన్ని మరోసారి దృఢంగా వెల్లడించారు. అమెరికా మరియు ఇజ్రాయెల్ చేసిన దాడులు తమ దేశ సార్వభౌమత్వంపై దురాక్రమణగా భావిస్తున్నామని ఆయన అన్నారు. ఈ చర్యలకు బాధ్యులైన దేశాలు పశ్చాత్తాపపడే ..మిగతా 3లో





# కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి గుడ్ బై

నాలుగు దశాబ్దాల ప్రయాణానికి ముగింపు
కార్యకర్తల సమావేశంలో రాజీనామా ప్రకటన
జీవన్ రెడ్డి వెంటే వేలాదిమంది అనుచరులు
పార్టీ విధానాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆరోపణలు
పార్టీ అంతర్గత వ్యవహారాలపై ప్రశ్నలు
రాజకీయంగా అన్యాయం జరిగిందని ఆవేదన
ఏ పార్టీలో చేరతారన్న దానిపై ఆసక్తి

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీలో నాలుగు దశాబ్దాలుగా కొనసాగిన తన రాజకీయ ప్రయాణానికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి ముగింపు పలికారు. జగిత్యాలలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన తన రాజీనామాను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు వేలాది మంది అనుచరులు కూడా కాంగ్రెస్ ..మిగతా 2లో

## ప్రయాణికులకు ఆర్టీసీ గుడ్‌న్యూస్!

హైదరాబాద్‌లో ఏసీ బస్సు టికెట్లపై రాయితీ
30 శాతం రాయితీ ప్రకటించిన సంస్థ
తక్కువ ఖర్చుతోనే ప్రయాణం
పెట్రోల్ బంకుల వద్ద క్యూలతో ప్రకటన
మూడు నెలల పాటు అమలు
ట్రాఫిక్ జామ్, ట్రాఫిక్ సమస్యకు స్వస్తి
ప్రయాణికులకు సమయం, డబ్బు ఆదా




**హైదరాబాద్, (డిడి9 వార్త):**
పెట్రోల్ కొరత, క్యూలు, ధరల పెరుగుదలతో వాహనదారులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్‌టీసీ) ప్రయాణికులకు మంచి వార్త చెప్పింది. హైదరాబాద్ నగర పరిధిలో నడిచే మెట్రో ఏసీ మరియు మెట్రో డీలక్స్ బస్సుల టికెట్ ధరలపై 30 శాతం రాయితీ ఇవ్వనుంది. ఈ నిర్ణయం వల్ల ప్రజలు ..మిగతా 3లో


## యుద్ధంలో అమెరికాదే విజయం

ఇరాన్ పూర్తిగా ఓడిపోయిందని ట్రంప్ వ్యాఖ్య
నౌకాదళం, వైమానిక దళం నాశనం అయ్యాయని వెల్లడి
అణ్వాయుధాలపై ఇరాన్ ఒప్పందానికి సిద్ధమని ప్రకటన
టెహ్రాన్‌పై వైమానిక ఆధిపత్యం కొనసాగుతోందన్న ట్రంప్
చర్చలకు అమెరికా కీలక నేతల బృందం
హార్మూజ్ జలసంధిపై "విలువైన బహుమతి" వ్యాఖ్య
అవసరమైతే దీర్ఘకాల చర్యలు కొనసాగిస్తామని హెచ్చరిక



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
ఇరాన్‌తో కొనసాగుతున్న ఘర్షణల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ యుద్ధంలో అమెరికా విజయం సాధించిందని ఆయన ప్రకటించారు. ఇరాన్ సైనిక శక్తి తీవ్రంగా ..మిగతా 3లో

## స్పీకర్‌కు హైకోర్ట్ నోటీసులు




ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యలకు సైతం..
ఫిరాయింపుల వ్యవహారంలో చర్యలు
స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేసిన బీఆర్ఎస్
పార్టీ మారలేదన్న తీర్పుపై వివాదం
ప్రముఖ ఎమ్మెల్యేలపై పిటిషన్ దాఖలు
కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశం
దానం నాగేందర్ కేసులో వేరు విచారణ
వచ్చే నెల 16కు తదుపరి విచారణ

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారిన పార్టీ మార్పుల అంశం ఇప్పుడు న్యాయస్థానానికి చేరింది. బీఆర్ఎస్‌కు చెందిన కొందరు ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన నిర్ణయంపై వివాదం కొనసాగుతుండగా, ఈ వ్యవహారంపై హైకోర్టు జోక్యం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఏడుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేయడం రాజకీయ వర్గాల్లో ..మిగతా 3లో

## రాష్ట్రంలో ఇంధన కొరత లేదు




పెట్రోల్, డీజిల్ కొరతపై మంత్రి ఉత్తమ్ స్పష్టత
రెండు నెలలకు సరిపడా నిల్వలు ఉన్నాయని హామీ
సోషల్ మీడియా పుకార్లతో పెరిగిన డిమాండ్
బంకుల వద్ద క్యూ లైన్లపై ప్రభుత్వ వివరణ
క్యాన్లలో ఇంధనం తీసుకెళ్లడం చట్టవిరుద్ధం
ఎల్పీజీ సిలిండర్ల సరఫరాపై స్పష్టత
పుకార్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ కొరత ఉందనే వార్తలు ప్రజల్లో ఆందోళన కలిగించాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో కొన్ని పెట్రోల్ బంకులు తాత్కాలికంగా మూతపడటంతో ప్రజలు గందరగోళానికి గురయ్యారు. దీంతో బంకుల ముందు పెద్ద సంఖ్యలో వాహనదారులు క్యూలు కట్టడం కనిపించింది. అయితే ఈ పరిస్థితిపై ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలకు భరోసా కల్పించింది. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎలాంటి ఇంధన కొరత లేదని తెలిపారు. పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ వంటి అవసరమైన ఇంధనాలన్నీ సరిపడా నిల్వల్లో ఉన్నాయని ఆయన వివరించారు. ప్రజలు పుకార్లను నమ్మి ఆందోళన చెందాల్సిన అవసరం ..మిగతా 2లో

## ఉగ్ర లింకులు.. హైదరాబాద్ మహిళ అరెస్ట్




**హైదరాబాద్, (డిడి9 వార్త):**
విజయవాడలో ఉగ్రవాద లింకుల కేసు దర్యాప్తు మరో కీలక మలుపు తీసుకుంది. హైదరాబాద్‌కు చెందిన సయిూదా బేగం అనే మహిళను ఆంధ్రప్రదేశ్ కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు అరెస్ట్ చేశారు. ఆమెను విజయవాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు ..మిగతా 2లో

విజయవాడ కేసు దర్యాప్తులో కీలక మలుపు
పోలీసుల అదుపులో సయిూదా బేగం
ఇప్పటికే ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు
విచారణలో వెలుగులోకి కీలక విషయాలు
ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక గ్రూప్ ఏర్పాటు
దేశ వ్యాప్తంగా మరో 12 మంది కీలక వ్యక్తులు
పాకిస్థాన్ హ్యాండ్లర్ల నుంచి ఆర్థిక సహాయం
దర్యాప్తు కొనసాగిస్తున్న పోలీసులు

## 99 రోజుల్లో ఇళ్ల కలలు సాకారం

అసెంబ్లీలో మంత్రి పొంగులేటి ప్రకటన
త్వరలో అసంపూర్తి ఇండ్ల పూర్తి
కొత్త ఇండ్ల కేటాయింపులు వేగవంతం
ఇందిరమ్మ ఇళ్ల సమస్యలపై ప్రత్యేక సమీక్షలు
టోల్ ఫ్రీ నంబర్‌తో ప్రజల సమస్యల పరిష్కారం
హైదరాబాద్‌లో వేలాది ఇళ్లకు మౌలిక సదుపాయాలు
ఖాళీగా ఉన్న ఇళ్లపై ప్రభుత్వం కఠిన నిర్ణయం
భారీగా నిధుల మంజూరు, పనుల వేగవంతం
మార్చి 31 నాటికి లక్షకు పైగా గృహ ప్రవేశాలు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
రాష్ట్రంలో పేదల గృహ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. 99 రోజుల ప్రణాళికలో భాగంగా చాలా కాలంగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయడమే కాకుండా, ఇప్పటివరకు కేటాయించని లేదా ఖాళీగా ఉన్న ఇళ్లను అర్హులైన నిరుపేదలకు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ విషయాన్ని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టంగా వెల్లడించారు.శాసనసభ సమావేశాల్లో పలు ..మిగతా 2లో





## ఉగ్ర లింకులు.. హైదరాబాద్ మహిళ అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి**

తరలించి విచారణ చేస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు యువకులను అరెస్ట్ చేసిన పోలీసులు, హైదరాబాద్ నుంచి మరో మహిళను అదుపులోకి తీసుకోవడం పెద్ద చర్చనీయాంశమైంది.

ఈ కేసు దర్యాప్తులో భాగంగా సయిదా బేగం కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు నిర్ధారించారు. విదేశీ హ్యాండ్లర్ అల్ హకీమ్ షకూర్ సూచనలమేరకుయువకులనుతీవ్రవాదసంస్థల వైపు మళ్లించడంలో ఆమె ప్రధానంగా పని చేసినట్లు విచారణలో తేలింది. మీర్జా సోహైల్ బేగ్, మహమ్మద్‌రెహ్మతుల్లా షరీఫ్,మహమ్మద్‌డానిష్ వంటి యువకులను ఉగ్రవాద భావజాలం వైపు ఆకర్షించడంలో సయిదా బేగం సహాయపడినట్లు పోలీసులు తెలిపారు.

**హైదరాబాద్ నుంచి అరెస్ట్.. విజయవాడకు తరలింపు**

చంచల్‌గూడకు చెందిన 35 ఏళ్ల సయిదా బేగంను కౌంటర్ ఇంటెలిజెన్స్ బృందం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుంది. ఆమెను వెంటనే విజయవాడకు తరలించి విచారణ ప్రారంభించారు. విజయవాడలో ఇప్పటికే ముగ్గురు యువకుల అరెస్ట్ తర్వాత వచ్చిన సమాచారం ఆధారంగా ఆమెపై దృష్టి సారించారు. ఈ అరెస్ట్ తెలుగు రాష్ట్రాల్లో ఉగ్రవాద కార్యకలాపాలపై కొత్త చర్చలు రేపుతోంది.

**ముగ్గురు యువకుల అరెస్ట్.. సోషల్ మీడియా లింకులు**

మార్చి 24న విజయవాడలోని వించ్‌పేట (పాతబస్తి) ప్రాంతంలో ముగ్గురు యువకులను కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు అరెస్ట్ చేశారు. వారు మహమ్మద్ రెహ్మతుల్లా షరీఫ్ (23), మీర్జా సోహైల్ బేగ్ (23), మహమ్మద్ డానిష్ (27). ఈ ముగ్గురూ సోషల్ మీడియా ద్వారా ఐసిస్ , అల్ ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ (AQIS) వంటి నిషేధిత సంస్థల భావజాలాన్ని ప్రచారం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ యాప్‌లలో రెచ్చగొట్టే వీడియోలు, పోస్టులు షేర్ చేస్తూ యువతను ఆకర్షించే ప్రయత్నం చేశారు.

**అల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ గ్రూప్.. 12 మంది నెట్‌వర్క్**

ఈ గ్యాంగ్ "అల్ మాలిక్ ఇస్లామిక్ యూత్" పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక గ్రూప్ ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ గ్రూప్‌లో సుమారు 12 మంది కీలక సభ్యులు ఉన్నారు. ఏపీ, తెలంగాణతో పాటు పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, కర్ణాటక, బీహార్, మహారాష్ట్ర, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో నెట్‌వర్క్ విస్తరించాలని వీరు ప్లాన్ చేశారు. పాకిస్థాన్ హ్యాండ్లర్ల నుంచి ఆర్థిక సహాయం అందుతున్నట్లు కూడా పోలీసులు నిర్ధారించారు. పరారీలో ఉన్న బీహార్ వాసి షాద్‌మాన్ దిల్కాష్‌తో సహా మిగిలిన వారి కోసం గాలింపు చేపట్టారు.

**యువకులను రాడికలైజ్ చేసే ప్రయత్నాలు**

విచారణలో నిందితులు విదేశీ హ్యాండ్లర్ అల్ హకీమ్ షకూర్‌తో నిరంతరం సంప్రదింపులు జరిపినట్లు తేలింది. యువతను ఉగ్రవాదం వైపు మళ్లించి, దేశంలో ఖిలాఫత్ స్థాపించాలని ప్లాన్ చేశారు. సోషల్ మీడియాలో ఐసిస్ ఫ్లాగ్‌లు, జిహాద్ సంబంధిత కంటెంట్ షేర్ చేయడం ద్వారా యువకుల మనసులు మార్చే ప్రయత్నం చేశారు. రెహ్మతుల్లా షరీఫ్ రాపిడో, ఉబర్ డ్రైవర్‌గా, డానిష్ ఆటో నగర్‌లో పని చేస్తున్నాడు, సోహైల్ బిర్యాని షాపులో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. వారి ఇంటి నుంచి ఐఈడి తయారీకి సంబంధించిన మెటీరియల్, ఇస్లామిక్ సాహిత్యం స్వాధీనం చేసుకున్నారు.

**యూఏపీఏ కింద కేసు..**
**ఎన్ఐఏ అప్పగించే అవకాశం**

నిందితులపై అన్‌లా ఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు త్వరలో జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించే అవకాశాలు ఉన్నాయి. గత సంవత్సరం గుజరాత్‌లో ముగ్గురు ఉగ్రవాద సానుభూతిపరులు అరెస్ట్ అయిన తర్వాత తెలుగు రాష్ట్రాల్లో అలర్ట్ పెంచారు. ఆ సమయంలోనే ఈ నెట్‌వర్క్ గురించి సమాచారం వచ్చినట్లు తెలుస్తోంది.

**ఏప్రిల్ 6 వరకు రిమాండ్.. కోర్టు విచారణ**

అరెస్ట్ అయిన ముగ్గురు యువకులను విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం వారికి ఏప్రిల్ 6 వరకు రిమాండ్ విధించింది. వారిని విజయవాడ సెంట్రల్ జైలుకు తరలించారు. కోర్టులో న్యాయవాదిని నియమించుకున్నారా అని న్యాయమూర్తి అడిగినప్పుడు తాము నియమించుకోలేమని నిందితులు తెలిపారు. దీనిని రాతపూర్వకంగా సమర్పించాలని కోర్టు ఆదేశించింది.

**ఉగ్రవాద మూలాలు ఛేదించడం..**
**ప్రజల భద్రత**

ఈ కేసు దర్యాప్తు ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఉగ్రవాద కార్యకలాపాలను అడ్డుకోవడంలో పోలీసులు విజయం సాధించారు. సోషల్ మీడియా ద్వారా యువతను రాడికలైజ్ చేసే ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ చర్యలు ముఖ్యమైనవి. యువకులు సోషల్ మీడియాలో వచ్చే కంటెంట్‌ను జాగ్రత్తగా చూడాలని, అనుమానాస్పదమైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. ఈ కేసు ఇంకా కొనసాగుతోంది. మరిన్ని వివరాలు త్వరలో బయటపడే అవకాశం ఉంది.


## పేదవాడి కుటుంబానికి అండగా డాక్టర్ రమేష్

**నిజామాబాద్ పోతంగల్ మార్చ్ 25(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం లోని హంగర్గా గ్రామనికి చెందిన డప్పు.గంగాధర్ అనే యువకుడు పోతంగల్ గ్రామ సమీపంలో యాక్సిడెంట్ అయ్యి గత 12 రోజుల నుండి నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ ఉన్నాడు. అతని భార్య సంవత్సరం వయస్సు గల కూతురు ఉంది. అతని పేద పరిస్థితి చూసి తట్టుకోలేని అతని స్నేహితులు ఈశ్వర్ హంగార్గా గ్రామ సర్పంచ్ భాస్కర్ విశ్వనాథ్ విరు కలిసి సితాలే రమేష్ డాక్టర్ గారికి తెలియజేయడం జరిగింది. విషయం తెలుసుకున్న డాక్టర్ రమేష్ మనసుగల మహారాజు వాట్సప్ స్టేటస్ ద్వారా బంధుమిత్రులకు తెలియజేయ



డం వలన 25 500/. జమ చేసి నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి బుధవారం రోజున అతని భార్యకు 25,500 రూపాయిలు సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో సితాలే రమేష్ సర్పంచ్ భాస్కర్ దుర్కీ గోపాల్ జంగం శివకుమార్ ఈశ్వర్ సందీప్ బజరంగ్ రవి పాల్గొనడం జరిగింది.



## రాష్ట్రంలో ఇంధన కొరత లేదు



**మొదటిపేజీ తరువాయి**

లేదని విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని మంత్రి తెలిపారు. రోజువారీ అవసరానికి మించి సరఫరా జరుగుతోందని కూడా ఆయన పేర్కొన్నారు. ఉదాహరణకు, ఒకరోజు డిమాండ్ ఎంత ఉంటుందో దానికంటే ఎక్కువ పరిమాణంలో ఇంధనం అందుబాటులోకి తీసుకువస్తున్నామని వివరించారు. దీంతో కొరతకు ఎలాంటి అవకాశం లేదని చెప్పారు.

అయితే సోషల్ మీడియాలో వ్యాప్తి చెందిన వదంతుల వల్ల డిమాండ్ ఒక్కసారిగా పెరిగిందని అధికారులు గుర్తించారు. సాధారణ పరిస్థితుల్లో ఉండే వినియోగం కంటే సుమారు 25 శాతం వరకు డిమాండ్ పెరిగినట్లు తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం అదనపు సరఫరా ద్వారా పరిస్థితిని నియంత్రణలో ఉంచుతోందని చెప్పారు.ఇంధన సరఫరా అంతరాయం లేకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. అదనంగా వేల కిలో లీటర్ల బఫర్ స్టాక్ సిద్ధం చేశామని, అవసరాన్ని బట్టి అదనపు ట్యాంకర్లను కూడా రంగంలోకి దింపామని చెప్పారు. సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు.

హైదరాబాద్‌లో కొన్ని పెట్రోల్ బంకులు తాత్కాలికంగా మూసివేయబడటంపై కూడా మంత్రి వివరణ ఇచ్చారు. ట్యాంకర్లు ఆలస్యంగా చేరుకోవడం వల్ల కొన్నిచోట్ల తాత్కాలికంగా స్టాక్ లేకపోవడం జరిగిందని చెప్పారు. కానీ ఇది నిజమైన కొరత కాదని స్పష్టం చేశారు. ట్యాంకర్లు చేరుకున్న వెంటనే సరఫరా పునరుద్ధరించబడుతుందని వివరించారు.ప్రజలు భయంతో ముందుగానే ఇంధనం నిల్వ చేసుకునేందుకు ప్రయత్నించడం కూడా సమస్యను పెంచుతోందని మంత్రి తెలిపారు. కొందరు క్యాన్లు, కంటెయినర్లలో పెట్రోల్, డీజిల్ తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. ఇది చట్టవిరుద్ధమని, ఇలాంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నగర పరిధిలో ఉన్న అన్ని పెట్రోల్ బంకులు సాధారణంగా పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. మొత్తం బంకుల్లో సరఫరా కొనసాగుతోందని, ఎక్కడా పూర్తిగా మూసివేయడం జరగదని హామీ ఇచ్చారు. ప్రభుత్వం పరిస్థితిని సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటుందని చెప్పారు.ఎల్పీజీ సిలిండర్ల విషయానికొస్తే, గృహ వినియోగానికి అవసరమైన సిలిండర్లు పూర్తిగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కమర్షియల్ సిలిండర్ల సరఫరాపై కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. చట్టవిరుద్ధంగా నిల్వ చేసిన కమర్షియల్ సిలిండర్లను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నామని గుర్తుచేశారు.

ఇంధన నిల్వల పరంగా కూడా రాష్ట్రం బలంగా ఉందని మంత్రి వివరించారు. స్ట్రాటజిక్ రిజర్వులు కూడా సరిపడా ఉన్నాయని, సరఫరాలో ఎలాంటి అంతరాయం రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సంబంధిత సంస్థలు నిరంతరం పర్యవేక్షణలో ఉన్నాయని చెప్పారు. మరోవైపు పోలీస్ అధికారులు కూడా ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ఇంధన కొరతపై వస్తున్న పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఎవరు కూడా అనవసరంగా నిల్వ చేసుకోవద్దని, అవసరానికి తగ్గట్టుగా మాత్రమే వినియోగించాలని కోరారు.

పుకార్లు సృష్టించి కృత్రిమ కొరత కలిగించే ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న సమాచారంపై నిఘా పెట్టామని తెలిపారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఇంధన కొరతపై వస్తున్న వార్తలు నిజం కావని ప్రభుత్వం స్పష్టం చేసింది. సరిపడా నిల్వలు ఉండటంతో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. పుకార్లను నమ్మకుండా, అధికారిక సమాచారం మేరకే స్పందించాలని ప్రభుత్వం, పోలీసులు సూచిస్తున్నారు.

## 99 రోజుల్లో ఇళ్ల కలలు సాకారం



**మొదటిపేజీ తరువాయి**

సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ మంత్రి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని గుర్తించిన ప్రభుత్వం వాటి పరిష్కారానికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోంది.

ఇందిరమ్మ ఇళ్ల సమస్యలను మూడు ప్రధాన విభాగాలుగా విభజించి వాటిని దశలవారీగా పరిష్కరించాలని నిర్ణయించారు. ఇందుకోసం త్వరలోనే ఉమ్మడి జిల్లాల వారీగా ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాల్లో స్థానిక సమస్యలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకునేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు.ప్రజలకు నేరుగా సేవలు అందించేందుకు టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ నంబర్ ద్వారా ప్రజలు తమ సమస్యలను నమోదు చేసుకోగలరు. వచ్చిన ప్రతి ఫిర్యాదుకు 24 గంటల్లో స్పందించి పరిష్కారం చూపే విధంగా అధికారులు పనిచేస్తారని మంత్రి తెలిపారు.

గతంలో నిర్మాణం ప్రారంభమైనా మధ్యలో ఆగిపోయిన ఇళ్లను పూర్తి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. మొత్తం అసంపూర్తిగా ఉన్న 92 వేల ఇళ్లలో ఇప్పటికే 62 వేల ఇళ్లను పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన ఇళ్లను కూడా త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు.హైదరాబాద్ నగరంలో కూడా డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిస్థితిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. నగరంలో పలు కాలనీలు పూర్తిగా అభివృద్ధి చెందకపోవడంతో ప్రజలు ఇళ్లలోకి వెళ్లడానికి వెనుకాడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు మౌలిక సదుపాయాల కోసం భారీగా నిధులు కేటాయించారు. రోడ్లు, నీటి సరఫరా, విద్యుత్ వంటి సదుపాయాలను అందించేందుకు ఇప్పటికే కోట్ల రూపాయలు ఖర్చు చేశారు.

గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్లలో చాలా వరకు ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వం గుర్తించింది. నగరానికి దూరంగా ఉండడం వల్ల కొంతమంది లబ్ధిదారులు అక్కడికి వెళ్లలేకపోయారు. ఈ నేపథ్యంలో వారికి మరో అవకాశం ఇచ్చి రెండు నెలల్లోగా గృహప్రవేశం చేయాలని నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ వారు రాకపోతే ఆ ఇళ్లను సమీప ప్రాంతాల్లో నివసించే అర్హులైన పేదలకు కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నారు.ఇళ్ల నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 80 కాలనీలకు అవసరమైన సదుపాయాల కోసం భారీ నిధులు మంజూరు చేశారు. ఇప్పటికే కొంత మొత్తాన్ని ఖర్చు చేసి పనులను కొనసాగిస్తున్నారు. మిగిలిన పనులను పూర్తి చేయడానికి మరిన్ని నిధులు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు.

అలాగే కొత్తగా కూడా భారీ స్థాయిలో ఇళ్లను మంజూరు చేస్తున్నారు. తొలి విడతలోనే లక్షల సంఖ్యలో ఇళ్లను ఆమోదించారు. గిరిజనులు, చెంచు వంటి ప్రత్యేక వర్గాలకు కూడా ప్రత్యేకంగా ఇళ్లను కేటాయించారు. దీంతో ప్రతి వర్గానికి గృహ భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది.కాలనీల్లో ఉన్న షాపుల విషయంలో కూడా ప్రభుత్వం కొత్త విధానాన్ని ఆలోచిస్తోంది. అద్దెలు సరిగా రాకపోవడం, కోర్టు కేసులు పెరగడం వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని వాటిని బహిరంగ వేలంలో విక్రయించి వచ్చిన డబ్బును కాలనీ అభివృద్ధికి వినియోగించేలా ప్రణాళిక రూపొందించారు. ఆ నిధులపై వచ్చే వడ్డీతో విద్యుత్, లిఫ్ట్ నిర్వహణ వంటి ఖర్చులను భరించాలనే ఆలోచనలో ఉన్నారు.

గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు కమిటీలను ఏర్పాటు చేశారు. సర్పంచ్ ఆధ్వర్యంలో ఈ కమిటీలు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తాయి. తరువాత కలెక్టర్ పరిశీలన, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో కేటాయింపులు జరుగుతాయి. భవిష్యత్తులో ఈ కమిటీల్లో ఎమ్మెల్యేలకూ ప్రాతినిధ్యం కల్పించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది.ప్రస్తుతం ప్రభుత్వం వేగంగా పనులు పూర్తి చేయడానికి కట్టుబడి ఉంది. మార్చి 31 నాటికి లక్షకు పైగా ఇళ్లలో గృహప్రవేశాలు జరగనున్నాయి. అలాగే జూన్ నాటికి మరో లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత రెండవ విడతలో మరిన్ని ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇంతకు ముందు గృహలక్ష్మి పథకం కింద ప్రారంభించి ఆగిపోయిన ఇళ్లను కూడా పూర్తి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. దీనికి సంబంధించి కేబినెట్‌లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే వేలాది మంది లబ్ధిదారులకు ఉపయోగం కలుగుతుంది. ప్రభుత్వం గృహ నిర్మాణాన్ని ఒక ప్రధాన సంక్షేమ కార్యక్రమంగా తీసుకుని ముందుకు సాగుతోంది. అసంపూర్తి పనులను పూర్తి చేయడం, ఖాళీ ఇళ్లను వినియోగంలోకి తేవడం, కొత్త ఇళ్లను మంజూరు చేయడం వంటి చర్యల ద్వారా పేదలకు స్థిర నివాసం కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. 99 రోజుల ప్రణాళిక ద్వారా వేగవంతమైన ఫలితాలు సాధించాలని ప్రభుత్వం ఆశిస్తోంది.

## కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి వీడ్కోలు!

**మొదటిపేజీ తరువాయి**

పార్టీకి గుడ్‌బై చెప్పారు.

జీవన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ తనను గుర్తించలేదని, తాను చేసిన సేవలకు సరైన గౌరవం దక్కలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంతోకాలంగా పార్టీ కోసం కష్టపడ్డా, తాను ఎదుర్కొన్న పరిస్థితులు బాధాకరంగా ఉన్నాయని అన్నారు. తన రాజకీయ జీవితంలో ఎన్నో పోరాటాలు చేసినప్పటికీ, ప్రస్తుతం పార్టీ వ్యవహారాలు తనకు అనుకూలంగా లేవని స్పష్టం చేశారు.జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి తాను చేసిన కృషిని ఆయన గుర్తుచేశారు. గతంలో కఠిన పరిస్థితుల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన సందర్భాలను ప్రస్తావించారు. అప్పటి రాజకీయ వాతావరణం ఎంత ప్రతికూలంగా ఉన్నప్పటికీ, ప్రజలు తనపై విశ్వాసం ఉంచి గెలిపించారని చెప్పారు. ఇది తనపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమ కాలంలో కూడా కాంగ్రెస్ తరఫున పోరాటం చేసినట్లు తెలిపారు. ఆ సమయంలో పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయాన్ని సాధించడం తన రాజకీయ జీవితంలో ముఖ్య ఘట్టమని చెప్పారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కూడా ప్రతిపక్షంగా కాంగ్రెస్ తరఫున నిరంతరం పోరాటం చేశానని గుర్తుచేశారు.పార్టీ లోపల జరుగుతున్న పరిణామాలపై జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఇది పార్టీ విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. గతంలో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసినవారిని తిరిగి ప్రోత్సహించడం అనైతికమని విమర్శించారు.

పార్టీ సమావేశాలకు ఇతర పార్టీలకు చెందిన నేతలు రావడం కూడా ఆయన విమర్శించారు.



ఇది కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో అనవసర జోక్యంగా భావిస్తున్నామని తెలిపారు. ముఖ్యమైన ఎన్నికల సమయంలో కూడా ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోవడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు.తన అనుచరుడి హత్య ఘటనపై ప్రభుత్వం స్పందించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలపై తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నప్పటికీ, స్పందన లేకపోవడం బాధాకరమని అన్నారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందని గుర్తుచేశారు.

తన రాజకీయ ప్రయాణంలో ఎన్నో బాధ్యతలు నిర్వహించినప్పటికీ,తగిన గుర్తింపు దక్కలేదని జీవన్ రెడ్డి అన్నారు. శాసనసభ్యుడిగా, శాసన మండలి సభ్యుడిగా పనిచేసిన అనుభవం ఉన్నప్పటికీ, మంత్రి పదవి విషయంలో తనను పక్కన పెట్టారని పేర్కొన్నారు. ఇది తనకు జరిగిన అన్యాయమని అన్నారు.ఒకప్పుడు రాష్ట్ర స్థాయి నాయకత్వ పోటీలో ఉన్న తన పరిస్థితి, ఇప్పుడు మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన హక్కుల కోసం కూడా పోరాడాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. పార్టీ లోపల తనను అణగదొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా జీవన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. పార్టీ లోపల ఇతర నాయకులు ఎదగకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చెందాలంటే సమాన అవకాశాలు ఇవ్వాలని సూచించారు. కానీ ప్రస్తుతం జరుగుతున్న వ్యవహారాలు ఆ దిశగా లేవని చెప్పారు. తాను గతంలో పలు ముఖ్య నాయకులతో రాజకీయంగా పోరాడినట్లు గుర్తుచేసిన జీవన్ రెడ్డి, ఇక నుంచి కూడా తన పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు చేసిన పోరాటం ఒక దశ అయితే, ఇక ముందు మరో దశ ప్రారంభమవుతుందని సంకేతం ఇచ్చారు.

రాష్ట్ర రాజకీయాల్లో ఈ పరిణామం కీలకంగా మారే అవకాశముంది. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నాయకుడు కాంగ్రెస్ పార్టీని వీడటం ఆ పార్టీకి పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. ఆయన తదుపరి రాజకీయ అడుగు ఏమిటన్నది ఆసక్తికరంగా మారింది.ఈ రాజీనామా కేవలం వ్యక్తిగత నిర్ణయం మాత్రమే కాకుండా, పార్టీ లోపల ఉన్న సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే సంఘటనగా కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో ఇది రాష్ట్ర రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాల్సి ఉంది.

## ఇంధన కొరత లేదు.. వదంతులు నమ్మొద్దు: సీపీ సాయి చైతన్య

- **జిల్లాలో సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు**
- **అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు**

**నిజామాబాద్ జిల్లా 25మార్చి(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య స్పష్టం చేశారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు నిండుగా ఉన్నాయని వెల్లడించారు. సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారం వల్ల ప్రజలు భయాందోళనకు గురై, ఒక్కసారిగా బంకుల వద్దకు క్యూ కడుతున్నారని సీపీ పేర్కొన్నారు. వాహనాల్లో ఫుల్ ట్యాంక్ నింపించుకోవడం వల్ల అనవసర రద్దీ ఏర్పడి, ఇతరులకు ఇబ్బంది కలుగుతోందని తెలిపారు. జిల్లాకు ఇంధన సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోందని, ఎవరూ అవసరానికి మించి నిల్వ చేసుకోవద్దని ఆయన సూచించారు. నిర్ధారించుకోని సమాచారాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసి ప్రజలను గందరగోళానికి గురిచేయవద్దని విజ్ఞప్తి చేశారు. వదంతులు వ్యాప్తి చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారిపై నిఘా ఉంచామని, అటువంటి వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉన్నారని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు.

# స్పీకర్‌కు హైకోర్ట్ నోటీసులు

మొదటిపేజీ తరువాయి



చర్చనీయాంశంగా మారింది.
ఇటీవల అసెంబ్లీ స్పీకర్ కొంతమంది ఎమ్మెల్యేలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, వారు పార్టీ మారలేదని తీర్పు ఇచ్చారు. మొత్తం పది మంది ఎమ్మెల్యేల విషయంలో ఈ నిర్ణయం వెలువడింది. అయితే ఈ నిర్ణయంతో అసంతృప్తి చెందిన బీఆర్ఎస్ నాయకత్వం దీనిని హైకోర్టులో సవాల్ చేసింది. స్పీకర్ తీర్పు సరైన విధంగా లేదని, రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ఉందని వాదించింది.ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది. దానం నాగేందర్, అరికేపూడి గాంధీ, కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్రావు వంటి ఎమ్మెల్యేల పేర్లు ఈ పిటిషన్‌లో ఉన్నాయి. వీరందరికీ కోర్టు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు ఇచ్చింది.
కోర్టు ఆదేశాల ప్రకారం, ఈ ఎమ్మెల్యేలు తమ వాదనలను వివరించే కౌంటర్‌ను సమర్పించాల్సి ఉంటుంది. తదుపరి విచారణను వచ్చే నెల 16వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకు ఈ కేసు రాజకీయంగా కూడా మరింత వేడి పుట్టించే అవకాశం ఉంది.మరోవైపు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సంబంధించిన కేసు కూడా వేరు దిశలో సాగుతోంది. ఈ విషయంలో బీజేపీ శాసన సభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో దానం నాగేందర్ పార్టీ మారిన అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు.
పిటిషన్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం, దానం నాగేందర్ బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచినప్పటికీ, తర్వాత కాంగ్రెస్ పార్టీ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశారు. ఈ చర్యతో ఆయన పార్టీ మారినట్టేనని, అందువల్ల ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని పిటిషనర్ కోరారు. ఇతర పార్టీ నుంచి నామినేషన్ దాఖలు చేసిన క్షణం నుంచే ఆయన సభ్యత్వం రద్దు కావాలని వాదించారు.ఈ కేసులో కూడా హైకోర్టు స్పందించి నోటీసులు జారీ చేసింది. దానం నాగేందర్‌తో పాటు అసెంబ్లీ కార్యదర్శికి కూడా నోటీసులు పంపించింది. ఈ వ్యవహారంపై వారి నుంచి వివరణ కోరింది. ఈ కేసు కూడా రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత పొందింది.
పిటిషనర్ తన వాదనలో సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన కొన్ని కీలక తీర్పులను ప్రస్తావించారు. ముఖ్యంగా కర్ణాటక, బిహార్ రాష్ట్రాల్లో జరిగిన ఇలాంటి కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ఉదాహరణగా చూపించారు. వాటి ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ పరిణామాలతో పార్టీ మార్పుల అంశం మళ్లీ రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. స్పీకర్ నిర్ణయం సరైనదా కాదా అన్నది ఇప్పుడు న్యాయస్థానం ముందు తేలనుంది. ఇది కేవలం కొన్ని ఎమ్మెల్యేల భవిష్యత్తుకే కాకుండా, రాష్ట్ర రాజకీయాల దిశను కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది.
ఇకపై ఇలాంటి అంశాల్లో స్పష్టమైన మార్గదర్శకాలు అవసరమనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. పార్టీ మార్పులపై కఠిన చర్యలు తీసుకోవాలని కొందరు నాయకులు కోరుతున్నారు. మరోవైపు ప్రజల విశ్వాసాన్ని కాపాడే విధంగా నిర్ణయాలు ఉండాలని కూడా సూచిస్తున్నారు.ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే అవకాశం ఉంది. హైకోర్టు తుది తీర్పు ఎలా ఉంటుందన్నది ఆసక్తిగా మారింది. రాజకీయ పార్టీలు కూడా ఈ పరిణామాలను జాగ్రత్తగా గమనిస్తున్నాయి. వచ్చే రోజుల్లో ఈ అంశంపై మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే అవకాశముంది.

## వడగళ్ళ వాన, ఈదురు గాలులతో
# యాసంగి పంట నష్టం..

- **రైతులకు ఎకరాకు రూపాయలు 25 వేల చొప్పున ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలి.**
- **ఆదిలాబాద్ జిల్లా రైతుస్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న డిమాండ్.**



**బజార్హత్నూర్, మార్చి 25(డిడి 9వార్త ):-**

బజార్ హత్నూర్ మండలం లోని రైతులు జాతీయ ప్రకృతి విపత్తు వలన నష్టపోయిన పంటకి ఎకరానికి 25 వేలరూపాయలచొప్పుననష్టపరిహారం చెల్లించాలని ఆదిలాబాద్ జిల్లా రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న ప్రభుత్వంను డిమాండ్ చేశారు. బుధవారం రోజు మండలంలోని కొలహరి శివారం మొక్క జొన్న రైతులతో ఆయన వ్యవసాయపంట చేల్లను తిరిగి పరిస్థితి అంచనా వేశారు.బజార్ హత్నూర్ మండలం లోని కొలహరి గ్రామ పరిధిలో మంగళవారం రోజు వడగళ్లు, అకాల వర్షాలు, ఈదురు గాలులతో భీభత్సం సృష్టించి పంటలను అతలా కుతలం చేసి తీవ్ర నష్ట పరచిన కారణంగా రైతులు యాసంగి పంటను తీవ్రంగా నష్టపోయారు.మొక్క జొన్న, జొన్న పంటలు గాలికి కింద పడిపోయిన రైతులతో కలిసి మాట్లాడారు.పంట నష్టపోయిన రైతులకిఒకఎకరాకి 25 వేల రూపాయల చొప్పున పరిహారం అందించాలని సంగెపు బొర్రన్న కోరారు.ఒక కొలహరి గ్రామ పరిధిలోనే దాదాపుగా మొక్క జొన్న, జొన్న పంట 45 ఎకరాలకు పైగా పంట నష్టపోయిందని, ఇంకా మండలం లోనే కాకుండా జిల్లా పరిధిలో పలు మండలంలలో మొక్క జొన్న, జొన్న పంటలతో పాటు పండ్ల తోటలు గల రైతులు కూడా గాలి దుమారంతో నష్ట పోయారని బొర్రన్న పేర్కొన్నారు .ఉదాహరణకు మామిడి పిందెలు, పూత ఖాతా కూడా నష్టం జరిగిందన్నారు.నష్టపోయిన రైతులను పలకరించి ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయ శాఖ అధికారులచే అంచనా వేసి నష్టపోయిన జొన్న, మొక్క జొన్న పంటలకు ఒక ఎకరాకి రూ. 25 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతీ గుంట భూమిని రికార్డు చేసి నివేదిక రాష్ట్రప్రభుత్వానికి అందజేసే విదంగా, ప్రతీ ఒక్క రైతుకు న్యాయం జరిగేలా అధికారులు పని చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట రైతులు గాండ్ల రవి, బామినినర్సయ్య, బామినిశ్రీనివాస్,బామిని చిన్నయ్య,సురేష్, గాండ్ల శంకర్ తదితర రైతులు ఉన్నారు.



# ప్రయాణికులకు ఆర్టీసీ గుడ్‌న్యూస్!

మొదటిపేజీ తరువాయి

సౌకర్యవంతంగా, తక్కువ ఖర్చులో ప్రయాణం చేయవచ్చు.
టీజీఎస్ఆర్టీసీ వీసీ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి ఈ మేరకు అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం పెట్రోల్ బంకుల వద్ద భారీ క్యూలు ఏర్పడుతున్నాయి. గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. ఇలాంటి సమయంలో సొంత వాహనాలు ఉపయోగించడం ఇబ్బందికరం కావడంతో ఆర్టీసీ బస్సులను ప్రోత్సహించాలని నిర్ణయించారు. "ఆర్టీసీ బస్సులు ఉండగా పెట్రోల్ కోసం ఇబ్బంది పడటం ఎందుకు?" అని నాగిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ రాయితీ మార్చి నెల నుంచి మూడు నెలల పాటు అమల్లో ఉంటుంది. హైదరాబాద్‌లోని ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారికి ఇది పెద్ద ఊరటగా మారనుంది. పెట్రోల్ ధరలు పెరిగినా, క్యూలు ఉన్నా ఇకపై బస్సు ఎక్కి సుఖంగా వెళ్లవచ్చు. ట్రాఫిక్ జామ్‌లు, పార్కింగ్ సమస్యల నుంచి కూడా తప్పించుకోవచ్చు.

**సమయం ఆదా అవుతుంది**

పెట్రోల్ బంకుల వద్ద గంటల తరబడి క్యూలో నిలబడి సమయం వృథా చేసుకోవాల్సిన అవసరం లేదు. ఆర్టీసీ బస్సులు సకాలంలో గమ్యస్థానానికి చేర్చేస్తాయి. సొంత వాహనం తీసుకెళ్తే ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి ఆలస్యం అవుతుంది. బస్సు ఎక్కితే సమయం ఆదా అవుతుంది, అలసట కూడా తగ్గుతుంది. ఉద్యోగులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

**ఇంధనం పొదుపు దేశానికి మేలు**

ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఇంధన సంక్షోభం ఉంది. ప్రతి చుక్క పెట్రోల్ విలువైనది. వ్యక్తిగత వాహనాలు తగ్గించి ప్రజా రవాణాను ఉపయోగిస్తే చాలా ఇంధనం ఆదా అవుతుంది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతుంది. ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి మాట్లాడుతూ, "ఇంధన సంక్షోభంలో ప్రతి ఒక్కరూ ప్రజా రవాణానికి మారాలి" అని సూచించారు. ఈ చిన్న చిన్న అడుగులు పెద్ద మార్పును తీసుకొస్తాయి.

**పర్యావరణం రక్షణలో ప్రజలు భాగస్వాములు**

రోడ్లపై వాహనాల సంఖ్య తగ్గితే కాలుష్యం కూడా తగ్గుతుంది. హైదరాబాద్‌లో ఇప్పటికే ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఎక్కువ మంది బస్సులు వాడితే రద్దీ తగ్గి, గాలి నాణ్యత మెరుగుపడుతుంది. ముఖ్యంగా ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు ఉపయోగించడం వల్ల కాలుష్యం ఏమాత్రం ఉండదు. ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణలో తన వంతు కృషి చేయాలని నాగిరెడ్డి కోరారు. ఇది మన భవిష్యత్ తరాలకు మంచిది.

**జేబుకు తక్కువ ఖర్చు, ప్రయాణం సుఖవంతం**

సాధారణంగా ఏసీ బస్సులు ఖరీదైనవి అని అనుకుంటారు. కానీ ఇప్పుడు 30 శాతం రాయితీతో ధరలు చాలా తగ్గాయి. ఉదాహరణకు, మునుపటి ధరలతో పోలిస్తే ఇప్పుడు బస్సు టికెట్ చాలా సరసం. పెట్రోల్ కొనడానికి ఖర్చు




చేసే డబ్బు కంటే బస్సులో ప్రయాణించడం చాలా ఆర్థికం. లగ్జరీ సీట్లు, ఏసీ సౌకర్యంతో సుఖంగా ప్రయాణం చేయవచ్చు. సామాన్య కుటుంబాల జేబుకు ఇది పెద్ద ఉపశమనం.

**ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయి**

హైదరాబాద్‌లో రోజువారీ ట్రాఫిక్ జామ్‌లు సాధారణం. ఎక్కువ మంది సొంత వాహనాలు ఉపయోగిస్తే రద్దీ మరింత పెరుగుతుంది. బస్సులను ఎక్కువగా వాడితే రోడ్లు కాస్త తేలికపడతాయి. ప్రయాణ సమయం తగ్గుతుంది. అందరూ బస్సు ఎక్కితే పార్కింగ్ స్థలాల కొరత కూడా తీరుతుంది. నగరం మొత్తం సాఫీగా నడుస్తుంది.

**ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి**

ఈ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని టీజీఎస్ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరకుండా, సేఫ్‌గా బస్సు ఎక్కి ప్రయాణం చేయాలి. మహిళలు, వృద్ధులు, యువత అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఆర్టీసీ బస్సుల సంఖ్యను కూడా పెంచే ఆలోచనలు చేస్తున్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజల జీవితాలను సులభతరం చేస్తాయి.
ఈ నిర్ణయం వెనుక ఉన్న ముఖ్య లక్ష్యం ప్రజా రవాణాను ప్రోత్సహించడం. పెట్రోల్ సంక్షోభం నుంచి బయటపడటం, పర్యావరణం కాపాడటం, ఆర్థిక ఆదా చేయడం వంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. హైదరాబాద్ వాసులు ఈ సువర్ణావకాశాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటే నగరం మరింత అభివృద్ధి చెందుతుంది.

# దాడులు కొనసాగిస్తూనే ఉంటాం

మొదటిపేజీ తరువాయి

వరకు ప్రతీకార చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.
ప్రస్తుత పరిస్థితులపై చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో జరిగిన చర్చల్లో కూడా ఇదే అంశాన్ని ఆయన ప్రస్తావించినట్లు సమాచారం. ఈ చర్చల్లో ప్రాంతీయ భద్రత, అంతర్జాతీయ పరిస్థితులు, యుద్ధ విస్తరణ అవకాశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. చైనా ఈ ప్రాంతంలో శాంతి నెలకొల్పేందుకు మధ్యవర్తిత్వం చేయాలని ప్రయత్నిస్తున్నప్పటికీ, పరిస్థితులు ఇంకా సంక్లిష్టంగానే ఉన్నాయి.ఇరాన్ ప్రకారం, అమెరికా మరియు ఇజ్రాయెల్ తమ దేశంలోని పౌర, రక్షణ మౌలిక సదుపాయాలపై దాడులు చేయడం వల్లే ఈ ఉద్రిక్తతలు పెరిగాయని పేర్కొంది. తమ దేశ రక్షణ కోసం తీసుకుంటున్న ప్రతి చర్య అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే ఉందని అరాగ్చీ అన్నారు. హర్మూజ్ జలసంధి మూసివేత వంటి చర్యలు కూడా అదే పరిధిలోకి వస్తాయని తెలిపారు.
ఇక గల్ఫ్ ప్రాంతంలో ఇరాన్ దాడులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా డ్రోన్ దాడులు పెరుగుతున్నాయి. తాజాగా కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని లక్ష్యంగా చేసుకుని జరిగిన డ్రోన్ దాడి పెద్ద కలకలం రేపింది. అయితే లక్ష్యాన్ని తప్పించిన ఆ డ్రోన్ సమీపంలోని ఇంధన ట్యాంకర్‌ను ఢీకొనడంతో భారీ అగ్నిప్రమాదం సంభవించింది.ఈ ఘటనలో భారీగా మంటలు చెలరేగడంతో పాటు దట్టమైన పొగ వ్యాపించింది. అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడానికి చర్యలు చేపట్టారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ప్రాణనష్టం జరగలేదు. కానీ ఆస్తి నష్టం మాత్రం సంభవించినట్లు అధికారులు తెలిపారు.
కువైట్ రక్షణ వ్యవస్థలు ఇరాన్ నుంచి వచ్చిన కొన్ని క్షిపణులు, డ్రోన్‌లను అడ్డుకున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని స్థానికులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని ప్రభుత్వం సూచించింది.ఇక అమెరికా, ఇజ్రాయెల్ వైఖరిపై ఇరాన్ సైనిక వర్గాలు కూడా తీవ్రంగా స్పందిస్తున్నాయి. ఇరాన్ లెఫ్టినెంట్ కల్నల్ ఇబ్రహీం జోల్ఫఖారీ మాట్లాడుతూ, అమెరికా చేస్తున్న దౌత్య ప్రయత్నాలు కేవలం నాటకమేనని విమర్శించారు. తమపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా ఈ చర్చలు జరుగుతున్నాయని ఆరోపించారు.
అమెరికా ప్రపంచానికి తన శక్తిని చూపించేందుకు చేసిన ప్రయత్నాలు ఇప్పుడు విఫలమయ్యాయని ఆయన ఎద్దేవా చేశారు. స్వయం ప్రకటిత అగ్రరాజ్యంగా చెప్పుకునే అమెరికా ఈ ప్రాంతంలో పూర్తిగా ఓటమి పాలైందని అన్నారు. ఈ పరిస్థితిని శాంతి ఒప్పందంగా చూపించేందుకు ప్రయత్నించడం సరైంది కాదని విమర్శించారు.ఇక ఇజ్రాయెల్ వైఖరిలో కూడా స్పష్టత లేకపోవడం గమనార్హం. ఐక్యరాజ్యసమితిలో ఇజ్రాయెల్ రాయబారి డానీ డనోన్ మాట్లాడుతూ, ఇరాన్, అమెరికా మధ్య జరుగుతున్న శాంతి చర్చల గురించి తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. తమ ప్రధాన లక్ష్యం ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యాన్ని అడ్డుకోవడమేనని స్పష్టం చేశారు.
ఈ పరిణామాలు చూస్తే, ఒకవైపు శాంతి చర్చల పేరుతో ప్రకటనలు వస్తుండగా, మరోవైపు నేలమీద మాత్రం యుద్ధ వాతావరణం కొనసాగుతున్నట్లు స్పష్టమవుతోంది. అమెరికా అధ్యక్షుడు ప్రకటిస్తున్న శాంతి ప్రయత్నాలు మరియు ఇరాన్ తీసుకుంటున్న కఠిన వైఖరి మధ్య తీవ్ర వ్యత్యాసం కనిపిస్తోంది.ఇరాన్ విప్లవ గార్డుల ప్రతినిధులు కూడా అమెరికాపై విమర్శలు గుప్పించారు. అమెరికా ఓటమిని శాంతి ఒప్పందంగా చూపించకూడదని హెచ్చరించారు. ఈ ప్రాంతంలో తమ ప్రభావాన్ని పెంచుకునే ప్రయత్నాలను తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు. యుద్ధం ముగింపుపై జరుగుతున్న చర్చలను కూడా వారు ఖండించారు.



ఇదిలా ఉంటే, అమెరికా మరియు ఇజ్రాయెల్ మధ్య ఇరాన్ నాయకులకు తాత్కాలిక భద్రత కల్పిస్తున్నారన్న వార్తలు వెలువడ్డాయి. చర్చలు కొనసాగుతున్నంతకాలం ఈ రక్షణ ఉంటుందని కొన్ని మీడియా సంస్థలు పేర్కొన్నాయి. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ధృవీకరణ లేదు.మధ్యప్రాచ్యంలో పరిస్థితి అత్యంత ఉద్రిక్తంగా మారింది. దాడులు, ప్రతిదాడులు కొనసాగుతుండగా, శాంతి చర్చలు ఎంతవరకు ఫలిస్తాయన్నది అనిశ్చితంగా ఉంది. ప్రాంతీయ భద్రతపై ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ పరిస్థితి ఎలా మారుతుందన్నది అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక అంశంగా మారింది.

# యుద్ధంలో అమెరికాదే విజయం

మొదటిపేజీ తరువాయి

దెబ్బతిన్నదని, ముఖ్యంగా వారి నౌకాదళం మరియు వైమానిక దళం పూర్తిగా నిర్వీర్యమైందని తెలిపారు.హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖకు సంబంధించిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ట్రంప్, ఇరాన్ యుద్ధంలో పూర్తిగా ఓడిపోయిందని వ్యాఖ్యానించారు. సైనిక పరంగా వారు తీవ్ర నష్టాన్ని చవిచూశారని, వారి రక్షణ వ్యవస్థలు దాదాపు కూలిపోయాయని అన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థలు కూడా దెబ్బతిన్నాయని తెలిపారు.ప్రస్తుతం అమెరికా మరియు ఇరాన్ మధ్య చర్చలు కొనసాగుతున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. ఈ చర్చల్లో ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయకూడదనే అంశంపై అంగీకారం తెలిపిందని ఆయన చెప్పారు. త్వరలోనే ఒక కీలక ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.
వైట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడిన సందర్భంగా ట్రంప్ ఈ విషయాన్ని మరింత స్పష్టంగా వివరించారు. గతంలో 2015లో జరిగిన అణు ఒప్పందాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఆ ఒప్పందాన్ని తాను రద్దు చేయకపోయి ఉంటే, ఇరాన్ ఇప్పటికే అణ్వాయుధాలను తయారు చేసుకునేదని అన్నారు. అంతేకాకుండా వాటిని వినియోగించే అవకాశమూ ఉండేదని పేర్కొన్నారు.అమెరికా తరఫున ఈ చర్చలను ఉన్నత స్థాయి నేతలు ముందుకు తీసుకెళ్తున్నారని ట్రంప్ తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్కో రుబియో, పశ్చిమాసియా వ్యవహారాల ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్, ఇతర ప్రముఖులు ఈ చర్చల్లో పాల్గొంటున్నారని చెప్పారు. వీరి సమన్వయంతో చర్చలు వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు.
ఇరాన్ నాయకత్వంలో మార్పులు వచ్చాయని ట్రంప్ వ్యాఖ్యానించారు. గతంలో ఉన్న నాయకత్వం సమస్యలను సృష్టించేదని, ప్రస్తుతం ఉన్న నాయకులు కొంతవరకు సహకార వైఖరిని చూపుతున్నారని తెలిపారు. అందుకే చర్చలు ముందుకు సాగుతున్నాయని చెప్పారు.యుద్ధ పరిస్థితులపై మాట్లాడిన ట్రంప్, అమెరికా వైమానిక దళం టెహ్రాన్‌తో పాటు ఇతర ప్రాంతాలపై ఆధిపత్యం కొనసాగిస్తోందని పేర్కొన్నారు. అవసరమైతే మరిన్ని చర్యలు తీసుకునేందుకు అమెరికా సిద్ధంగా ఉందని హెచ్చరించారు. ఇరాన్ తన భవిష్యత్తు గురించి సరైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇక హర్మూజ్ జలసంధి విషయంపై కూడా ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ నుంచి అమెరికాకు ఒక "విలువైన బహుమతి" లభించిందని తెలిపారు. అయితే ఆ బహుమతి ఏమిటన్నది స్పష్టంగా చెప్పలేదు. అది అణ్వాయుధాలకు సంబంధించినది కాదని, చమురు లేదా వాయువు రంగానికి సంబంధించిన అంశమని మాత్రమే పేర్కొన్నారు.మరోవైపు అమెరికా రక్షణ శాఖ కూడా ఇదే తరహా వ్యాఖ్యలు చేసింది. రక్షణ శాఖ కార్యదర్శి పీట్ హెగ్సెత్ మాట్లాడుతూ, ఇరాన్ సైన్యంపై అమెరికా చేసిన దాడులు చరిత్రలో ఎప్పుడూ లేనంత తీవ్రంగా జరిగాయని అన్నారు. ఆధునిక యుద్ధాల్లో ఇంత వేగంగా ఒక దేశ సైన్యం నిర్వీర్యం కావడం అరుదని పేర్కొన్నారు.



యుద్ధం ప్రారంభం నుంచే ఖచ్చితమైన లక్ష్యాలతో దాడులు జరిపామని, అందువల్లే ఇరాన్ సైన్యాన్ని బలహీనపరిచామని చెప్పారు. ప్రస్తుతం టెహ్రాన్‌పై అమెరికా వైమానిక ఆధిపత్యం కొనసాగుతోందని తెలిపారు. ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యాన్ని పూర్తిగా అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలు పొందకుండా చూడటమే అమెరికా బాధ్యత అని హెగ్సెత్ అన్నారు. అవసరమైతే దీర్ఘకాలం పాటు చర్యలు కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.
ఈ పరిణామాల నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఒకవైపు యుద్ధం ముగిసిందని అమెరికా ప్రకటిస్తుండగా, మరోవైపు భవిష్యత్తు పరిస్థితులపై అనిశ్చితి కొనసాగుతోంది.ఇరాన్ అధికారికంగా ఎలాంటి స్పందన ఇస్తుందన్నది కూడా ఆసక్తికరంగా మారింది. మొత్తంగా చూస్తే, ఈ యుద్ధం తర్వాతి దశలోకి ప్రవేశించినట్లు కనిపిస్తోంది. సైనిక చర్యల నుంచి దౌత్య చర్చల వైపు పరిస్థితి మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అయితే ఈ చర్చలు ఎంతవరకు ఫలిస్తాయన్నది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది. అంతర్జాతీయ సమాజం కూడా ఈ పరిణామాలను దగ్గరగా గమనిస్తోంది.





# పరీక్ష కేంద్రాలను సందర్శించిన టీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మావురం శ్రీకాంత్





**నస్రుల్లాబాద్, మార్చి 25(డిడి9 వార్త):**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా తెలంగాణ స్టూడెంట్ పరిషత్ (టీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు మావురం శ్రీకాంత్ మంగళవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని నస్రుల్లాబాద్ మండలంలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాలను సందర్శించారు.మండలంలోని నెమలి హైస్కూల్‌తో పాటు మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను కోరారు.అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి వారికి ధైర్యం చెప్పారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు పూర్తి సహకారం అందేలా చూడాలని ఒక పత్రికా ప్రకటనలో మావురం శ్రీకాంత్ తెలిపారు.



## రాజీవ్ నగర్ యూపీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, మర్చి 25(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా రాజీవ్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ ఆకస్మికంగా సందర్శించి సేవల నిర్వహణపై తనిఖీ చేపట్టారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, రోగులకు అందుతున్న సౌకర్యాలు, హాజరు రిజిస్టర్లు తదితర అంశాలను పరిశీలించారు. అలాగే ఆసుపత్రి పరిసరాల్లో శుభ్రత, వైద్య సిబ్బంది సమయపాలన, రోగుల పట్ల వ్యవహార శైలి వంటి విషయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. అదేవిధంగా ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య సేవలను సమర్థవంతంగా వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు .ఈ తనిఖీ కార్యక్రమంలో వైద్యాధికారి సాయి ఈశ్వరి, సంబంధిత వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## సహజ వ్యవసాయంతోనే ఆరోగ్యకర సమాజం

**బోధన్, నిజామాబాద్ జిల్లా 25మార్చి(డీడీ9 వార్త) :**

రసాయన రహిత వ్యవసాయం ద్వారానే ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తి సాధ్యమని, భూసారాన్ని కాపాడుకోవడానికి ప్రతి రైతు సహజ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని వ్యవసాయాధికారులు పిలుపునిచ్చారు. బుధవారం నవీపేట మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో సహజ వ్యవసాయ ప్రాముఖ్యతపై రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్, ఏఈఓ వసంత్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడటం వల్ల సాగు ఖర్చులు పెరగడమే కాకుండా భూమి నిస్సారమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ ద్వారా ప్రకృతి సిద్ధమైన పద్ధతులను అనుసరించడం వల్ల ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో భాగంగా కింద నమోదు చేసుకున్న రైతులకు మట్టి ఆరోగ్య కార్డులను (సోషల్ హెల్త్ కార్డ్స్) పంపిణీ చేశారు. అలాగే రైతులకు ప్రోత్సాహకంగా జూట్ బ్యాగులు, నోట్‌బుక్స్, పెన్నులు, క్యాలెండర్లు మరియు క్యాప్‌స్‌ను అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని గ్రామాల్లో ఈ తరహా అవగాహన సదస్సులు నిర్వహించి రైతులను సహజ సాగు దిశగా ప్రోత్సహిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అర్మూర్ లావణ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నర్సింగ్ రావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మగ్గరి హన్మండ్లు, రిసోర్స్ పర్సన్ రవీందర్, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్ పాల్గొన్నారు. అలాగే యువ రైతులు ప్రవీణ్, గణేష్, సంజీవ్, సంపత్, పోతన్న, కిషాన్, లింగా రెడ్డి, శ్రీకాంత్, నవీన్, రాజు, దశరథ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## తోషం తండా అభివృద్ధికి మరో ముందడుగు – కల్వర్టు పనులకు శ్రీకారం

**డిడి9 వార్త గుడిహత్నూర్**

తోషం తండా అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోంది. గ్రామ అభివృద్ధి పట్ల ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ సర్పంచ్ జాదవ్ జితేందర్, అనిల్ జాదవ్ సమన్వయంతో కొత్త కల్వర్టు పనులకు శ్రీకారం చుట్టడం విశేషంగా నిలిచింది. ఈ కల్వర్టు నిర్మాణం ద్వారా ముఖ్యంగా లచ్చు మహారాజ్ మందిరానికి వెళ్లే భక్తులకు, అలాగే గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం మరింత సులభం కానుంది. ఇప్పటివరకు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగిపోనున్నాయి. గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చుతూ ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా తీసుకున్న ఈ చర్య తోషం తండా అభివృద్ధికి బాటలు వేస్తోంది. ఈ పనులు త్వరితగతిన, నాణ్యతతో పూర్తి కావాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు. భవిష్యత్తులో తోషం తండా మరిన్ని మౌలిక సదుపాయాలతో ఆదర్శ గ్రామంగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.






## సత్తా చాటిన వివేకానంద పాఠశాల,సోనాల విద్యార్థులు

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 25(డి డి 9)**

ఐదవ తరగతి ప్రవేశం కొరకు నిన్న వెలువడినటువంటి తెలంగాణ గురుకుల పాఠశాలల ఫలితాలలో సత్తా చాటినటువంటి వివేకానంద పాఠశాల,సోనాల విద్యార్థులు... 20 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా మొదటి పేస్లోనే 15 సీట్లు వచ్చాయి అని ప్రిన్సిపాల్ కృష్ణ చైతన్య తెలియజేశారు... ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు, అభినందన కార్యక్రమం ఏర్పాటు చేయడం,ఈ కార్యక్రమంలో విద్యార్థులు పోషకులతో సహా హాజరయ్యారు,ఈ సందర్భంగా యాజమాన్యం విద్యార్థులను ఉపాధ్యాయులను అభినందించారు.



## కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా గాయక్వాడ్ హన్మంత్

**నిజామాబాద్ పోతంగల్ మార్చి 25 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీసు నందు బుధవారం రోజున కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా నియామక పత్రాన్ని కోటగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ గాయక్వాడ్ హనుమంతు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీలో ఉండి కష్టమైనా నష్టమైన ఎన్ని ఇబ్బందులు వచ్చినా పార్టీని వీడకుండా పార్టీ పక్షాన నిలబడినందున అది గమనించిన స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి కి తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాలరాజు గారికి నా పైన నమ్మకం ఉంచి నాకు ఇచ్చిన ఇట్టి పదవిని నేను నమ్మకంగా నెరవేర్చి పెద్దలకు కాంగ్రెస్ పార్టీకి మంచి పేరును తీసుకువస్తానని గాయక్వాడ్ హనుమంతు తెలిపారు.ఈ కార్యక్రమంలో పోతంగల్ మాజీ ఎంపీపీ గంధపు పవన్ గొట్టం మనోహర్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం



**నిజామాబాద్ పోతంగల్ మార్చి 25 (డిడి9 వార్త)**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పోతంగల్ మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్య శిభిరం ఏర్పాట చేశారు. నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజ్ తరపున బుధవారం రోజు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు ఈ శిబిరానికి పోతంగల్ మండలంలోని వివిధ గ్రామాల వాళ్ళు అధిక సంఖ్యలో వచ్చి అవసరమైన పరీక్షలు చేయించుకుని ఉచిత మందులు తీసుకున్నారు. ఈ వైద్య శిబిరానికి 1 జనరల్ మెడిసిన్ 2 పీడియాట్రిక్ 3 గైనిక్ 4 ఆరో బొక్కల డాక్టర్ 5 దంతల డాక్టర్ 6 కంటి డాక్టర్ పాల్గొని రోగులను మెరుగైన వైద్యం అందించి ఉచిత మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల వైద్యులు , పోతంగల్ సర్పంచ్ కల్లూరి సంధ్య హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.





## వివాహ, నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి, పోచారం భాస్కర్ రెడ్డి

**కామారెడ్డి/బాన్సువాడ, మర్చి 25(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శుభం కన్వెన్షన్ హాల్‌లో బాన్సువాడ పట్టణానికి చెందిన నాగులగామ వెంకన్న కుమారుడు రతీష్ వివాహ నిశ్చితార్థ వేడుకకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాబోయే వధూవరులు రతీష్-వర్షలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి కూడా పాల్గొన్నారు.అనంతరం బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్ మండల కేంద్రంలో దత్తు పటేల్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పర్సమేత్రి బుచ్చిగోండా గారి కుమారుడు మహేందర్ వివాహ వేడుకకు మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి హాజరై నూతన వధూవరులు మహేందర్-ప్రియాంకలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బాన్సువాడ పట్టణం మరియు బీర్కూర్ మండలానికి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు పోచారం నాయకులతో పాటు పాల్గొన్నారు.



# ఇంద్రవెల్లి ఏకలవ్య మోడల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్(డిడి9వార్త ) :-**

విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఇంద్రవెల్లి మండలంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా పాఠశాల లోని వసతులు, విద్యార్థుల హాజరు పట్టిక, భోజన మెనూ ఆయన పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం వసతి గృహంలో పలువురు విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న భోజన నాణ్యతను, వసతి గృహంలోని సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఇంగ్లీష్ భాషా, సబ్జెక్టుపై నైపుణ్యం పెంచుకోవాలని సూచించి, వారిని పలు ప్రశ్నలు అడిగి సమాధానాలను రాబట్టారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, పారిశుధ్యం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాల ఆవరణ లోని వాకింగ్ మరమ్మతులు చేపట్టి త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అంతకుముందు పాఠశాలలోని వంట గది, సరుకు నిల్వల గది, భోజన శాల, వసతి గృహాలను పరిశీలించారు. పాఠశాల లో అవసరమైన స్పోర్ట్స్ షూస్, గ్రిజర్స్, ఇతర సౌకర్యాలు, వసతులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలి ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ రేఖ రాణి, డిఈ శివ ప్రసాద్, పిఈటి సరిత, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.






## వీరాపూర్ గ్రామపంచాయతీని సందర్శించిన డీఎల్పీఓ

**బీర్కూర్, మార్చి 25(డిడి9 వార్త):**

బీర్కూర్ మండలంలోని వీరాపూర్ గ్రామపంచాయతీని డీఎల్పీఓ బుధవారం సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే గ్రామంలో ఏర్పాటు చేసిన కంపోస్ట్ షెడ్‌ను సందర్శించి ఎరువు తయారీ ప్రక్రియను పరిశీలించి సంబంధిత సిబ్బందికి తగు సూచనలు చేశారు.అదేవిధంగా గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి పంచాయతీ కార్యదర్శికి పలు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ ప్రసాద్ రావు,కార్యదర్శి దివ్య, ఎంపీవో మహిబూబ్, సర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







## సాంకేతికత సహాయంతో అక్రమమును కనిపెట్టావచ్చుని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్శిషా నిరూపించారూ.

**బజార్హత్నూర్ మార్చి 25(డిడి 9వార్త ):-**

సాంకేతిక పరిజ్ఞానం సరిగ్గా ఉపయోగం చేస్తే అక్రమాలు బయటకు తీయవచ్చని ప్రయోగం ద్వారా ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్శి షా నిరూపణచేశారు. మంగళవారం రోజు భీంపూర్ మండలం అందర్ బంద్ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలని ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంలో మెనూతో పాటు బియ్యం, నిత్యావసర సరకుల నాణ్యత ను పరిశీలన చేస్తున్న క్రమంలో ఆయన సెల్ ఫోన్ లోని డిజిటల్ స్కేల్ యాప్ ద్వారా గుడ్డు బరువును తూకం వేసి చూశారు.5060 గ్రాములు ఉండాల్సిన గుడ్డు బరువు 40గ్రాములు ఉన్నట్లు వెళ్ళడైనది వెంటనే మొత్తం గుడ్లు తూకం వేసి వీడియో తీసి తనకు పంపాలని వార్డెన్ జ్ఞానేశ్వర్ ను ఆదేశించారు.గుడ్ల బరువు తక్కువగా ఉన్నట్లు తేలితే గుత్తే దారుపై చర్యలు తీసుకొనున్నట్లు హెచ్చరిక జారీ చేశారు.



## కామారెడ్డి ఆర్డీవోగా ఎన్‌వై గిరి బాధ్యతలు స్వీకారం

**కామారెడ్డి, మర్చి 25(డిడి9 వార్త):**

కామారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారిగా ఎన్‌వై గిరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలసి పూల మొక్క అందజేశారు.కాగా, ఇప్పటివరకు ఆర్డీవోగా విధులు నిర్వహించిన వీణాను బదిలీ చేసి ఎండోమెంట్స్ శాఖ ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా డిప్యూటేషన్‌పై నియమించారు.





## కాండ్లిలో పశు వైద్య శిబిరం ఉచిత గాలికుంటూ నివారణ టీకాలు.

**బజార్హత్నూర్, మార్చి 25,(డిడి9వార్త ):-**

ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండలోని కాండ్లి గ్రామంలోబుధవారం రోజు పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగాపశువులకు గాలి కుంటూ వ్యాధి (FMD)కి నివారణ టీకాలను పశు వైద్య అధికారులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆగ్రామ సర్పంచ్ జాదవ్ అనిత,మండలపశు వైద్యాధికారి డాక్టర్ పర్వేజ్ అహ్మద్, పశువైద్య సిబ్బంది. సి.హెచ్.అరవింద్, జాడే దుర్గాజీ,జాడే మారుతీ, జగన్,సుధాకర్,ఆ గ్రామరైతులు ,తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు.



**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 25 (డి డి 9) :-**

బోథ్ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు N. అక్షర ,M యుగేందర్, M .నందిత మరియు నాగభూషణం మెమోరియల్ స్కూల్ విద్యార్థులు షఫీయా, రూతిక, శాన్విక, కృషవేణి, శ్రీనిజ. సాయినిత్య, మహీధర్,ఇటీవల విడుదలైన గురుకుల ఎంట్రన్స్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి 5వ తరగతిలో సీట్లు సాధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు ఎటువంటి బయట కోచింగ్ సెంటర్లు, ట్యూషన్స్ వెళ్లకుండా పాఠశాలలోనే ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వల్ల ఈ విజయం సాధించామని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోషకులు విద్యార్థులను అభినందించారు.





## ట్రైటాడైరీ–క్యాలెండర్ ఆవిష్కరణ

**బజార్ హత్నూర్ మార్చి,25, (డిడి9వార్త ):-**

తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ఇన్స్టిట్యూషన్స్ (TTREITA)డైరీ-క్యాలెండర్‌ను బుధవారం రోజు పగలు విరామ సమయంలో ఆదిలాబాద్ ఇంటర్మీడియట్ విద్యాధికారి జాదవ్ గణేష్ కుమార్ చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర సంఘ బాధ్యులు రాజేంద్ర ప్రసాద్, జిల్లాబాధ్యులు గోవర్ధన్, మారుతి శర్మ, పుట్టలక్ష్మణ్ తదితరులు మాట్లాడుతూ సంఘం సాధించిన విజయాలను వివరించారు. ట్రైబల్ విద్యార్థుల అభ్యున్నతికి సంఘం చేస్తున్న కృషిని కొనియాడారు.ఆదిలాబాద్ మాధ్యమిక విద్యాధికారి మాట్లాడుతూ, ట్రైబల్ విద్యార్థులను సమగ్రంగా తీర్చిదిద్దుతూ సమాజానికి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు వస్తున్నారని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల బేల ప్రిన్సిపల్ భగవాన్లు, క్యాంప్ జనరల్ సూరజ్ సింగ్, తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చట్ల ప్రవీణ్ కుమార్ మరియు ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.




## ఇందన కొరత అనేది తప్పుడు ప్రచారం.

- **తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మర్రి అమరేందర్ రెడ్డి.**

**ఆదిలాబాద్ ,మార్చి,25(డిడి 9వార్త ):-**

ఇంధన కొరత ఉందనేది కేవలం తప్పుడు వార్త అని తెలంగాణ పెట్రోలియం డీలర్స్అసోసియేషన్ మర్రి అమరేందర్ రెడ్డి బుధవారం నాడు ఒక ప్రకటన జారీచేశారు.దీని వల్ల ప్రజలు అనవసరంగా బంకుల వద్ద క్యూ కడుతున్నారన్నారు.ప్రస్తుతం ఎచ్పిసిఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ వంటి కంపెనీల వద్ద తగినంత నిల్వలు ఉన్నాయి.సరఫరా గొలుసు (సప్లై చైన్ ) ఎక్కడాఆగలేదు.భయం వల్ల ప్రజలు ఒక్కసారిగా కొనుగోలు చేయడం వల్ల సాధారణం కంటే 2.5 నుంచి 3 రెట్లు విక్రయాలుపెరిగాయి. దీనివల్ల కొన్ని బంకుల్లో తాత్కాలికంగా కొరత ఉండవచ్చు. కానీ,అదికొరత కాదు.పెట్రోల్ లేదా డీజిల్‌ను డబ్బాల్లో,క్యాన్లలో నింపి నిల్వ చేయడం పెసో(peso) నిబంధనలకువిరుద్ధం.ఇది చాలా ప్రమాదకరం & అగ్ని ప్రమాదాలకు దారి తీయవచ్చు.ప్రజలు తమకు అవసరమైనంత మేరకే ఇంధనాన్ని కొనుగోలు చేయాలని, అనవసరంగా నిల్వ చేయవద్దని అసోసియేషన్ కోరింది.తప్పుడు వార్తలను నమ్మకండి లేదా ప్రచారం చేయకండి. బాధ్యతా యుతంగా వ్యవహరించండి.



Email : tpda3333@gmail.com

IndianOil Bharat Petroleum

President M. AMARENDER REDDY Cell: 9866600033
Treasurer LV KUMAR Cell: 9848050321
General Secretary Vinod Vishwanath Cell: 9849013536

PRESS NOTE

Date: 25.03.2026.

It has come to our notice that due to the circulation of false and misleading news regarding a fuel shortage, many people are rushing to fuel stations and filling their tanks unnecessarily.

This panic buying has led to an abnormal surge in sales — nearly 2.5 to 3 times the normal levels — resulting in temporary stock exhaustion at several retail outlets across the country.

We would like to assure all citizens that:

- There is NO shortage of fuel
- Adequate stock is available with HPCL, IOCL, BPCL
- Supply chains are functioning normally

IMPORTANT SAFETY NOTICE:

Carrying petrol or diesel in cans for storage is against PESO norms and poses a serious safety risk. Improper storage of fuel can lead to hazardous situations, including fire accidents. This is not a safe or approved method of storing fuel.

We request everyone to act responsibly:

* Avoid panic buying
* Do not store fuel in unauthorized containers
* Purchase fuel only as per your regular needs

Let's work together to prevent inconvenience and ensure safety for all.





# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తే సహించం: కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్ జిల్లా 25మార్చి(డీడీ9 వార్త) :**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు.

మండలాల వారీగా ఇళ్ల నిర్మాణ పురోగతిని సమీక్షించిన కలెక్టర్, లక్ష్య సాధనలో వెనుకబడిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. వచ్చే నెల రోజుల్లోగా బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్లన్నీ రూఫ్ లెవల్‌కు చేరుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించని లబ్ధిదారుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందించని వారి పేర్లను జాబితా నుండి తొలగించి, ఆ స్థానంలో కొత్తగా అర్హులైన వారికి అవకాశం కల్పించాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక అందుబాటులో ఉందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్న వారికి ఐకేపీ, మెప్మా ద్వారా రుణాలు కూడా మంజూరు చేశామని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో ఎవరైనా అవినీతికి పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. వచ్చే సమీక్ష నాటికి 'నాట్ గ్రౌండింగ్' (పనులు ప్రారంభించని) జాబితాలో ఒక్క ఇల్లు కూడా ఉండకూడదని అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, హౌసింగ్ ఇన్చార్జి పీడీ గంగాధర్, ఈఈ నివర్తి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు మరియు హౌసింగ్ ఏఈలు పాల్గొన్నారు.



# అంబులెన్స్ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

**నిజామాబాద్ జిల్లా 25మార్చి(డీడీ9 వార్త) :**

అత్యవసర సేవలు అందించే అంబులెన్స్ డ్రైవర్లు వేగంతో పాటు నిలకడను పాటిస్తూ ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించాలని భీమ్ గల్ ఎస్ఐ తిరుపతి సూచించారు. ఇటీవల అంబులెన్స్‌లు వరుసగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకొని, బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో అంబులెన్స్ డ్రైవర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. రోగులను సకాలంలో ఆసుపత్రికి చేర్చడం ఎంత ముఖ్యమో, మార్గమధ్యంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడం కూడా అంతే ముఖ్యమని గుర్తు చేశారు. అత్యవసర స్థితిలో ఉన్నామనే నెపంతో అజాగ్రత్తగా, అతివేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రాణదాతలే ప్రాణాలు తీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు తావివ్వకూడదని స్పష్టం చేశారు. రహదారిపై వెళ్లే ఇతర వాహనదారుల భద్రతను కూడా గమనిస్తూ వాహనాలను నడపాలని హితవు పలికారు. ప్రజల ప్రాణ రక్షణలో అంబులెన్స్ డ్రైవర్ల పాత్ర కీలకమని, ఆ బాధ్యతను విస్మరించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అంబులెన్స్ డ్రైవర్లు పాల్గొన్నారు.




# సౌన లో ఇండ్ల స్థలాల భూమిని సర్వే చేయాలి.

**సౌన (నిర్మల్ జిల్లా కుబీర్ ), మార్చి, (డిడి9వార్త ):-**

సౌన గ్రామస్తులకు ఇచ్చిన ఇడ్ల పట్టాల భూమిలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (aikms) నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జే రాజు డిమాండ్ చేసారు. బుధవారం కుబీర్ తహశీల్దార్ కి వినతిపత్రం ఇచ్చారు. 1983 లో వరదతో మునిగిన సౌన గ్రామ ప్రజలకు సర్వే నెంబర్ 10 లో భూమిని కేటాయించి పట్టాలు ఇవ్వడం జరింగిందని తెలియజేసారు. ఈ భూమిని కొలిచి ప్లాట్ల కేటాయింపు జరగలేదు.గత సంవత్సరం వరదలతో మళ్ళీ ఊర్లో కి నీళ్లు వచ్చి, ఇండ్లలోని సామానులు మునిగినయి. వాగు ఒడ్డున ఉండడంతో పాములు, తేళ్లు ఇతర జంతువులు ఇండ్లలోకి వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం అలోచించి భూమిని సర్వే చేసి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలనీ డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గణపతి,భీమ్, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.




# బాసర రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సాయికిరణ్

**నిర్మల్ జిల్లా బాసర, మార్చి 25 (డిడి9వార్త ):-**



నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ లో ఈ రోజు పి. సాయి కిరణ్, ఐపీఎస్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాలు, జిల్లా ఎస్పీ కార్యాలయం మెమోరాండం మేరకు ఈ నియామకం జరిగింది. భైంసా ఎస్‌డిపిఓ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఆయన, యూనివర్సిటీ పరిధిలో శాంతి భద్రతలను కట్టుదిట్టంగా అమలు చేస్తామని తెలిపారు. విద్యార్థులు, సిబ్బందికి భద్రత కల్పించడం పై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. యూనివర్సిటీ యాజమాన్యంతో సమన్వయం చేసుకుంటూ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. పోలీసులకు పూర్తి సహకారం అందించాలని యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బందిని కోరారు.

# పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి: మున్సిపల్ చైర్ పర్సన్

**నిజామాబాద్ జిల్లా 25మార్చి(డీడీ9 వార్త) :**

భీమ్ గల్ పట్టణంలోని ప్రధాన రహదారుల అభివృద్ధిలో భాగంగా బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ బోదిరే నాగమణి స్వామి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వేల్పూర్ రోడ్డులో డబుల్ రోడ్డు మరియు సెంటర్ డివైడర్ నిర్మాణ పనులను ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.... పట్టణంలోని రహదారుల ఆధునీకరణకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఆర్ అండ్ బి నిధుల నుండి సుమారు 8 కోట్ల రూపాయలతో ఈ పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఈ నిధులతో వేల్పూర్ రోడ్డులోని శివ సాయి హాస్పిటల్ నుండి కమాన్ వరకు, అలాగే నంది గల్లీలోని పోచమ్మ గుడి నుండి బైపాస్ రోడ్డు వరకు మరియు బడా భీంగల్ రోడ్డులోని సుభాష్ నగర్ చౌరస్తా నుండి బైపాస్ రోడ్డు వరకు సుమారు ఒక కిలోమీటర్ మేర డబుల్ రోడ్డు నిర్మాణం మరియు సెంటర్ డివైడర్ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించిన బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ గారికి ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిర్ణీత సమయంలోగా నాణ్యతతో పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు జేజే నర్సయ్య, అనంతరావు, కన్నె సురేందర్, ఆరేపల్లి నాగేంద్రబాబు, సందీప్, సురేష్, సంగ్యా నాయక్, దినేష్, శ్యామ్ రాజ్ స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**నిజామాబాద్ జిల్లా 25మార్చి(డీడీ9 వార్త) :**

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని భీమ్ గల్ పోలీసులు హెచ్చరించారు. భీమ్ గల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఐదుగురు వ్యక్తులను బుధవారం ఆర్మూర్ కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన మేజిస్ట్రేట్ నిందితుల్లో నలుగురికి ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున మొత్తం 40 వేల జరిమానా విధించారు. ఈర్ల నాగరాజు అనే వ్యక్తికి జరిమానాతో పాటు నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే భారీ జరిమానాలతో పాటు జైలు శిక్షలు తప్పవని హెచ్చరించారు.





# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష – రూ.30 వేల జరిమానా

**కామారెడ్డి, మర్చి 25(డిడి9 వార్త):**



పోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.30,000 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. నిజాంసాగర్ పోలీసుల కృషితో నేరం నిరూపితమై బాధితురాలికి న్యాయం జరిగింది. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులను జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర అభినందించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2023 మే 6న మధ్యాహ్నం నిజాంసాగర్ మండలానికి చెందిన ఓ మహిళ సంత నిమిత్తం పిట్లంకి వెళ్లగా, ఆమె 17 సంవత్సరాల మైనర్ కూతురు ఇంట్లోనే ఉంది. సాయంత్రం ఆమె ఇంటికి తిరిగి వచ్చేసరికి కూతురు కనిపించలేదు. ఇంటి పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో నిజాంసాగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో నిజాంసాగర్ మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల శేఖర్ అనే వ్యక్తి ఈ ఘటనకు పాల్పడినట్లు తేలింది. ఇప్పటికే వివాహితుడైన అతడు అదే ప్రాంతానికి చెందిన మైనర్ బాలికపై కన్నేసి, ఆమె కుటుంబానికి ఆస్తి ఎక్కువగా ఉందని గమనించి ఆ ఆస్తి దక్కించుకోవాలనే ఉద్దేశంతో పన్నాగం పన్నాడు. ఈ క్రమంలో బాలిక ఫోన్ నెంబర్ సంపాదించి తరచూ మాట్లాడి నమ్మకం కలిగించాడు. తరువాత ఎవ్వరూ లేని సమయంలో మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం 2023 మే 6న బాలిక తల్లి ఇంట్లో లేని సమయంలో ఇంటికి వచ్చి మాయమాటలు చెప్పి బాలికను తనతో తీసుకెళ్లి వర్ని మండలంలోని బడాపాడ్‌కు తీసుకెళ్లి బలవంతంగా తాళి కట్టాడు. తరువాత బాధితురాలిని హైదరాబాద్‌కు తీసుకెళ్లి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు.మిస్సింగ్ బాలిక ఆచూకీ తెలిసిన తర్వాత నిందితుడి నేరం బయటపడింది. బాలిక మైనర్ అని తెలిసి కూడా ప్రేమ, వివాహం పేరుతో మోసం చేసి లైంగిక దాడికి పాల్పడినందుకు కేసును వెంటనే పోక్సో చట్టం కింద మార్చి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం నేరాన్ని నిరూపించడానికి అవసరమైన బలమైన సాక్ష్యాధారాలు సేకరించి నిందితుడిపై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలు, వైద్య నివేదికలను పరిశీలించిన గౌరవ జిల్లా న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్.వి.వి. ఆర్. వరప్రసాద్ కేసు రుజువైనట్లు తేల్చి నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.30,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.ఈ కేసును సమర్థంగా విచారణ చేసిన అప్పటి నిజాంసాగర్ ఎస్‌హెచ్ఓ ఎన్. రాజు, బాన్సువాడ డీఎస్పీ కె. జగన్నాథ రెడ్డి, పోలీసు తరపున వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. శేషు, కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టిన ప్రస్తుత ఎస్‌హెచ్ఓ శివకుమార్, సీఐ తిరుపయ్య, డీఎస్పీ బి. విట్టల్ రెడ్డి, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్ఐ రామేశ్వర్ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ శ్రీకాంత్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

# 'మహిళా మార్ట్' ను ప్రారంభం చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా.

**ఆదిలాబాద్, మార్చి 25(డిడి9వార్త ప్రతినిధి) :-**

మహిళా సాధికారత దిశగా ఆదిలాబాద్ జిల్లా మరో ముందడుగు వేసిందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం జిల్లా మహిళా సమాఖ్య, సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిలాబాద్ మహిళా మార్ట్' ప్రారంభోత్సవానికి ఆదిలాబాద్ పురపాలక సంస్థఅధ్యక్షురాలు బండారి అనూషతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని మహిళా సంఘాలు తయారు చేస్తున్న సుమారు 30 రకాలకు పైగా నాణ్యమైన ఉత్పత్తులు ఈ మార్ట్‌లో లభ్యమవుతాయని తెలిపారు. పట్టణనడిబొడ్డున, ప్రధాన రహదారి పక్కనే ఈ మార్ట్‌ను ఏర్పాటు చేయడం వల్ల వినియోగదారులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన వస్తువులు నేరుగా అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆదివాసీలు తయారు చేసే ప్రకృతి సిద్ధమైన ఉత్పత్తులకు, అటవీ ఉత్పత్తులకు ఇక్కడ ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. 'మేడ్ ఇన్ ఆదిలాబాద్ ఫర్ ఆదిలాబాద్' అనే నినాదంతో ప్రారంభమైన ఈ మార్ట్, భవిష్యత్తులో హైదరాబాద్‌లోని ఐఎంఎస్ బజార్ తరహాలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం పురపాలక అధ్యక్షులు మాట్లాడుతూ, జిల్లాలో మహిళా సంఘాల ద్వారా తయారైన ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సౌకర్యంకల్పించాలనే ఉద్దేశంతో ఈ వినూత్న విక్రయ కేంద్రాన్ని అందుబాటులోకి తేవడం జరిగిందని తెలిపారు. కేవలం ఉద్యోగాలకేపరిమితం కాకుండా మహిళలు వ్యాపార రంగంలోనూ రాణించడం గర్వకారణమనికొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓరవీందర్, వార్డ్ కౌన్సిలర్ కలాల శ్రీనివాస్, మహిళా సమైఖ్య సభ్యులు లక్ష్మి, బృందన, మంజుల, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేద విద్యార్థులకు అండగా నిలవడం అభినందనీయం

**నిజామాబాద్ జిల్లా 25మార్చి(డీడీ9 వార్త) :**

నిరుపేద విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. అగుమెంట్ గోల్డ్ ఫర్ ఆల్ సంస్థ సహకారంతో, పద్మపాణి సొసైటీ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో ఇంజనీరింగ్ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యలో మెరుగైన ప్రతిభ కనబరుస్తున్న నిరుపేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేయడం వారి భవిష్యత్తుకు ఎంతో దోహదపడుతుందన్నారు. సామాజిక బాధ్యతతో పద్మపాణి సంస్థ మరియు అగుమెంట్ సంస్థలు చేస్తున్న సేవలను ఆమె కొనియాడారు. జిల్లాకు మరిన్ని సీఎస్ఆర్ నిధులను తీసుకువచ్చి, మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సంస్థ ప్రతినిధులను కోరారు. అనంతరం డిచ్పల్లిలోని మానవతా సదన్‌లో నివసిస్తున్న 70 మంది బాలబాలికలకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మానవతా సదన్ విద్యార్థులు తమ హస్తకళతో తయారు చేసిన ఆర్ట్ ఫ్రేమ్‌ను కలెక్టర్‌కు అందజేయగా, ఆమె వారిని ప్రత్యేకంగా అభినందించారు. అగుమెంట్ గోల్డ్ ఫర్ ఆల్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. భవిష్యత్తులో విద్యార్థులకు అవసరమైన తోడ్పాటునందించడంతో పాటు, తమ కంపెనీ ద్వారా ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా విద్యాధికారి అశోక్ కుమార్, లైజన్ ఆఫీసర్ సుధాకర్ మాట్లాడుతూ సంస్థల సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పద్మపాణి సొసైటీ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, అగుమెంట్ గోల్డ్ జనరల్ మేనేజర్ సామ్యూల్ రాజ్, ఏజీఎం కాశీనాథ్, ప్రతినిధులు విద్యా శ్రీనివాసరావు, రమేష్, సాయికుమార్, ప్రవీణ్, మహేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి

**రాయిగూడ 25 మార్చ్ ( డిడి9 వార్త న్యూస్ ):**



సిరికొండ మండలం రాయిగూడ గ్రామములో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్‌ప్రెసిడెంట్ బగునూరే. మాధవ్ పటేల్ గారికి మరియు డిసిసి జనరల్ సెక్రెటరీ షేక్ ఇమామ్ గారికి తమ గ్రామములో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ గారి క్యాబినెట్లో సిరికొండ మండలానికి చెందిన ఇద్దరికీ పదవులు రావడం చాలా ఆనందంగా ఉందని, కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా అభివృద్ధి చెందే విధంగా బీసీ సమాజం నుండి బగునూరే.మాధవ్ పటేల్ గారిని అలాగే షేక్. ఇమామ్ గారికి మంచి స్థానాన్ని కల్పించిన డా.,నరేష్ జాదవ్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపడం జరిగినది. రానున్న ఎంపిటిసి జెడ్పిటిసి ఎన్నికలను సమర్ధవంతంగా ముందుకు తీసుకెళ్లగల సత్తా ఉన్నవారికి పదవులు ఇవ్వడం చాలా బాగుందని, సిరికొండ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని వారు ఈ సందర్భంగా మాట్లాడడం జరిగినది. ఈ కార్యక్రమం రాయిగూడ గ్రామ పటేల్ మరియు మహాజన్, శ్రీకాంత్ (దేవరీ) ఆధ్వర్యంలో ఇరువురికి శాలువాతో ఘనంగా సన్మానించారు.కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని రానున్న రోజులలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని వారు అన్నారు. ఈ సందర్భంలో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ భగునూరే మాధవరావు పటేల్ మరియు డీసీసీ జనరల్ సెక్రెటరీ షేక్. ఇమామ్, మరియు రాయిగూడ గ్రామస్తులు పంద్రం.హనుమంతు పటేల్, పంద్రం.శ్రీకాంత్ దేవరి, సిడం మదన్ మహాజన్ సిడం జైవంతరావు ఆత్రం శంభు మాజీ ఉప సర్పంచ్ జగ్నాక్ లక్ష్మణ్ ఉప సర్పంచ్ మరియు గ్రామ ప్రజలు ఆత్రం హనుమంతరావు సిడం.బాలాజీ పంద్రం. విఠల్, పంద్రం.రాము,పంద్రం. రమేష్.పంద్రం. మహేష్ పాల్గొన్నారు.





# యువతకు ఉపాధి మార్గం.. పాలిటెక్నిక్ విద్య : ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి

**నిజామాబాద్ జిల్లా 25మార్చి(డీడీ9 వార్త) :**

యువతకు తక్షణ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేసిందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఆయన నవీపేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించారు. కళాశాలలో అందుబాటులో ఉన్న వసతులు, బోధనా సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో విరివిగా పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నప్పటికీ, ప్రవేశాల సంఖ్య ఆశించిన స్థాయిలో లేకపోవడంపై అధికారులకు కీలక సూచనలు చేశారు. పాలిటెక్నిక్ కోర్సుల ప్రాధాన్యతపై విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రస్తుతం నవీపేట కళాశాలలో ఉన్న సివిల్, మెకానికల్ విభాగాలతో పాటు, వచ్చే విద్యా సంవత్సరం నుండి ఆధునిక కోర్సులైన రోబోటిక్స్, కంప్యూటర్ సైన్స్ అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలు కూడా సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. అలాగే కల్తీ ఆహార పదార్థాల విక్రయాలపై కఠిన నిఘా ఉంచాలని సంబంధిత శాఖలకు సూచించారు.



నిజామాబాద్, నిర్మల్ జిల్లాల రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వం ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని కేటాయించిందని, దీని కోసం అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఫ్యాక్టరీ పనులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక, మొరం ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, ఆర్డీఓ రాజేంద్రకుమార్, ప్రిన్సిపాల్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వారెంట్లపై పోలీసుల ఉక్కుపాదం : సీపీ సాయి చైతన్య

- **నాలుగు రోజుల్లో 105 నాన్-బెయిలబుల్ వారెంట్లు పరిష్కారం**
- **పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాల గాలింపు**



**నిజామాబాద్ జిల్లా 25మార్చి(డీడీ9 వార్త) :**

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు న్యాయ ప్రక్రియను వేగవంతం చేసేందుకు నిజామాబాద్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కమిషనరేట్ పరిధిలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్ల సంఖ్యను తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 20 నుండి 24 వరకు అమలు చేసిన ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలో కీలక పురోగతి సాధించినట్లు ఆయన వివరించారు. ఈ నాలుగు రోజుల వ్యవధిలోనే మొత్తం 105 నాన్‌బెయిలబుల్ వారెంట్లను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ తప్పించుకు తిరుగుతున్న నేరస్థులపై 82, 83 ప్రొసీడింగ్స్ ప్రకారం వారి స్థిర, చర ఆస్తులను జప్తు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు హెచ్చరించారు. గల్ఫ్ దేశాలకు పారిపోయిన నిందితుల కోసం మూడు లుక్ అవుట్ సర్కులర్లు జారీ చేసినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో పరారీలో ఉన్న 9 మందిని, ఇతర జిల్లాల్లో ఉన్న నలుగురు నిందితులను ప్రత్యేక బృందాలు పట్టుకుని వారెంట్లను అమలు చేసినట్లు పేర్కొన్నారు. కోర్టు విచారణలకు నిందితులు హాజరయ్యేలా చూడటంతో పాటు, పాత 55 కేసుల్లో వారెంట్లను క్లియర్ చేసినట్లు సీపీ తెలిపారు. క్రైమ్ మీటింగ్‌ల ద్వారా పెండింగ్ వారెంట్ల స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, గడువులోగా అన్ని పెండింగ్ కేసులను పరిష్కరించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు.

# శనగల కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- **బోధన్, సాలూర మండలాల్లోని కొనుగోలు కేంద్రాల సందర్శన**
- **రైతులతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశం**

**నిజామాబాద్ జిల్లా 25మార్చి(డీడీ9 వార్త) :**

శనగల కొనుగోలు కేంద్రాల్లో తూకాలు వేగవంతం చేసి రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ డి.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన బోధన్, సాలూర మండలాల్లోని మావందికుర్ధు, కల్దుర్కి, సాలూర కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన కేంద్రాల వద్ద వేచి ఉన్న రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మావందికుర్దులోని ప్యాక్స్ కేంద్రం వద్ద డి.ఎం మాట్లాడుతూ.. రైతులు తెచ్చిన దిగుబడిని ఎప్పటికప్పుడు కంటా (తూకం) వేయాలని, జాప్యం చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ ప్రతినిధి భాస్కర్, మాజీ వైస్ ప్రెసిడెంట్ మనబాయ్ వీరభద్రరావు, సీఈఓ దేశముఖ్ ఉమాకాంత్, రైతులు పాల్గొన్నారు.



# మార్కెట్ యార్డులో పారదర్శకత ముఖ్యం

- **పసుపు విక్రయదారులతో పోలీస్ కమిషనర్ భేటీ**
- **తప్పడు తూకాలు, మధ్యవర్తుల మోసాలపై కఠిన నిఘా**

**నిజామాబాద్ జిల్లా 25మార్చి(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు క్రయవిక్రయాలు ఎటువంటి ఆటంకాలు లేకుండా, పారదర్శకంగా సాగాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య స్పష్టం చేశారు. బుధవారం ఆయన మార్కెట్ యార్డును సందర్శించి, పసుపు విక్రయదారులు మరియు రైతులతో నేరుగా మాట్లాడారు. మార్కెట్‌లో వారికి అందుతున్న వసతులు, ఎదుర్కొంటున్న ఇబ్బందులను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మార్కెట్ ప్రాంగణంలో ఎలాంటి గొడవలు, వివాదాలకు తావివ్వకుండా శాంతియుత వాతావరణంలో వ్యాపారాలు సాగాలని సూచించారు. ముఖ్యంగా తప్పుడు తూకాలు వేయడం, మధ్యవర్తుల మోసాలకు పాల్పడటం వంటి ఘటనలు జరగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు నష్టపోకుండా చూడటం అందరి బాధ్యతని గుర్తుచేశారు. మార్కెట్ యార్డ్ పరిధిలోని అన్ని గేట్ల వద్ద సెక్యూరిటీ సిబ్బంది నిరంతరం నిఘా ఉంచాలని, అనుమతి లేని వ్యక్తులను లోపలికి రానివ్వకూడదని ఆదేశించారు. భద్రతా పరమైన లోపాలు లేకుండా ఉండేందుకు ప్రాంగణమంతా సీసీ కెమెరాల నిఘాలో ఉండాలని సూచించారు. మార్కెట్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. ఏదైనా అనుమానాస్పద ఘటనలు లేదా అక్రమాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీపీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్3 ఎస్ఐ శ్రీహరి బాబు, మార్కెట్ యార్డ్ సిబ్బంది మరియు పసుపు రైతులు పాల్గొన్నారు.




# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షన్ తప్పదు

- **శిక్షణకు గైర్హాజరైన బీఎల్ఓలపై కలెక్టర్ ఆగ్రహం**
- **షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశం**

**నిజామాబాద్ జిల్లా 25మార్చి(డీడీ9 వార్త) :**

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిని సహించేది లేదని, తీరు మార్చుకోకపోతే మూకుమ్మడి సస్పెన్షన్లకు వెనుకాడబోమని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను హెచ్చరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై బూత్ లెవల్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు బీఎల్ఓలు శిక్షణకు గైర్హాజరు కావడాన్ని గమనించిన కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శిక్షణకు రాకపోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ, గైర్హాజరైన వారందరికీ వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యం కారణంగానే ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం వెనుకబడి ఉందని, సూపర్వైజర్లు ఏం చేస్తున్నారని ఆమె నిలదీశారు. బీఎల్ఓలుగా వ్యవహరిస్తున్న మెప్మా ఆర్పీలు, అంగన్వాడీ సిబ్బంది, వార్డు ఆఫీసర్లు తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు జ్ఞానేశ్వర్, సంతోష్ కుమార్‌లు బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో నిర్వహించాల్సిన విధులు, ఎన్యుమరేషన్ ఫారాల నమోదు, ధృవీకరణ పత్రాల పరిశీలనపై అవగాహన కల్పించారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యంగా బూత్ లెవల్ ఏజెంట్ల సహకారంతో ఈ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ రవీంద్ర సాగర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, తహసిల్దార్లు శ్రీధర్, విజయ్ కాంత్ తదితరులు పాల్గొన్నారు.



# రాజు వెడ్స్ రాంబాయి దర్శకుడి రెండో సినిమా ఫిక్స్?

దర్శకుడిగా కెరీర్ ప్రారంభించిన తొలి చిత్రంతోనే మంచి గుర్తింపును సంపాదించుకున్న వారిలో 'రాజు వెడ్స్ రాంబాయి' దర్శకుడు సాయిలు ఒకరు. ఈ చిత్రంలో అఖిల్ రాజ్, తేజస్విని రావు హీరో హీరోయిన్లుగా నటించగా, వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మాతలుగా వ్యవహరించారు. చాలా తక్కువ బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా గత సంవత్సరం నవంబర్‌లో విడుదలై ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందింది. బాక్సాఫీస్ వద్ద సుమారు రూ.17 కోట్ల వరకు కలెక్షన్లను రాబట్టి భారీ విజయాన్ని అందుకుంది. దీంతో దర్శకుడు సాయిలుపై ఇండస్ట్రీ వర్గాల దృష్టి పడింది.
అలాగే ఆయన తదుపరి చిత్రం ఎవరితో ఉంటుందనే ఆసక్తి కూడా ప్రేక్షకుల్లో పెరిగింది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, సాయిలు రెండో సినిమా ఇప్పటికే ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. ప్రముఖ నిర్మాత ఆసియన్ సునీల్ నారంగ్ సోదరుడు భరత్ నారంగ్, రామ్మోహనరావు ఈ చిత్రానికి నిర్మాతలుగా వ్యవహరించనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా ఈవెంట్ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ, తాను గ్రామీణ నేపథ్యంలో కథలను తెరకెక్కించడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. దీంతో ఆయన తదుపరి సినిమా కూడా గ్రామీణ బ్యాక్‌డ్రాప్‌లోనే ఉండే అవకాశముందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.




## స్కైని తాకిన మమితా పాపులారిటీ.. కాల్షీట్స్ కోసం క్యూకడుతున్న ఫిల్మ్ మేకర్స్!

'ప్రేమలు' లాంటి డబ్బింగ్ చిత్రంతో సౌత్ మొత్తం రాత్రికి రాత్రే స్టార్ డమ్ సంపాదించుకున్న మలయాళ కుట్టీ 'మమితా బైజు'. మాలీవుడ్‌లో 15 సినిమాలు చేసినా రాని లక్.. ప్రేమలుతో దక్కడంతో దాన్ని క్యాష్ చేసుకుని పనిలో బిజీ అయ్యారు. తెలుగులో పెద్దగా ఆఫర్స్ రాకపోవడంతో.. పొరుగున ఉన్న కోలీవుడ్‌పై మమితా ఫోకస్ పెట్టారు. రెబల్ డెబ్యూసినా.. డ్యూడ్ హిట్‌తో అమ్మడి పాపులారిటీ స్కైని తాకింది. యూత్ అటెన్షన్ గ్రాబ్ చేయడంలో సక్సెస్ కావడంతో.. తమిళ్ ఫిల్మ్ మేకర్స్ మమితా కాల్షీట్స్ కోసం క్యూ కట్టారు.
ప్రేమలు తర్వాత మంచి ఆఫర్స్ వస్తాయని ఊహించిందీ కానీ.. ఏకంగా స్టార్స్ హీరోలైన విజయ్ దళపతి, సూర్య, ధనుష్‌లతో నటించే గోల్డెన్ ఛాన్స్ కొట్టేశారు మమితా బైజు. విజయ్ జననాయగన్‌తో పాటు సూర్య విశ్వనాథ్ అండ్ సన్స్, ధనుష్ కరలో నటిస్తున్నారు. అదే సమయంలో సెలక్టివ్ సబ్జెక్ట్స్ చూజ్ చేసుకుంటూ.. మూవీ మూవీకి వేరియేషన్ చూపిస్తూ.. డిఫరెంట్ క్యారెక్టర్స్ ఎక్స్ ప్లోర్ చేస్తున్నారు.
జన నాయగన్‌లో విజయ్ దళపతి కూతురిగా.. స్ట్రాంగ్ గర్ల్ రోల్ మమితా బైజు చేస్తున్నారు. సూర్య విశ్వనాథ్ అండ్ సన్స్‌లో పూర్తి కాంట్రాస్ట్ క్యారెక్టర్ చేస్తున్నారు. తన కన్నా 20 ఏళ్ల పెద్దయిన వ్యక్తి ప్రేమలో పడి, అతడి లవ్ కోసం పరితపించిపోయే నాటీగర్ల్ రోల్‌లో కనిపించబోతున్నారు. ఇక ధనుష్ కరలో పక్కా పల్లెటూరి అమ్మాయిగా, ఫక్తు డీ గ్లామర్ రోల్ చేయబోతున్నారు. విష్ణు విశాల్ ఇరుండు వానం ప్యూర్ లవ్ స్టోరీగా రాబోతుంది. ఇలా డిఫరెంట్ షేడ్స్‌ను చూపిస్తూ.. ఏ పాత్రకైనా తాను ఫిట్ అవ్వగలనని మమితా ప్రూవ్ చేసుకుంటున్నారు.



## మరోసారి 'సితార'లో నితిన్?



ప్రస్తుతం టాలీవుడ్‌లో అత్యంత డేంజర్ జోన్‌లో కెరీర్‌ను కొనసాగిస్తున్న హీరోల్లో నితిన్ ఒకరిగా కనిపిస్తున్నారు. ఈయనకు ఆఖరుగా 2020లో విడుదలైన 'భీష్మ' చిత్రంతో మంచి విజయం దక్కింది. ఆ తర్వాత నుండి ఆయన నటించిన పలు చిత్రాలు బాక్స్ ఆఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో, నితిన్ తదుపరి సినిమాలపై ఆసక్తి నెలకొంది. నితిన్‌కు బాగా కలిసి వచ్చిన నిర్మాణ సంస్థల్లో సీతారా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ ముందు వరుసలో ఉంటుంది. ఈ బ్యానర్‌లో ఆయన ఇప్పటికే 'భీష్మ', 'రంగ్ దే' వంటి చిత్రాలు చేసి ప్రేక్షకులను అలరించారు.
తాజాగా ముచ్చటగా మూడోసారి ఈ బ్యానర్‌లోనే నితిన్ సినిమా చేయబోతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ ప్రాజెక్ట్‌ను ఓ కొత్త దర్శకుడు తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన కథ దాదాపు పూర్తయినట్లు, మరికొన్ని రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, నితిన్ వి.ఐ. ఆనంద్ దర్శకత్వంలో ఓ సైన్స్ ఫిక్షన్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ మూవీపై అభిమానుల్లో మంచి ఆసక్తి నెలకొంది. అలాగే 'ఆయ్' చిత్ర దర్శకుడు అంజి కె మణిపుత్రతో కూడా ఓ సినిమా చేసే ఆలోచనలో ఉన్నట్లు టాలీవుడ్ వర్గాల్లో ఓ టాక్ నడుస్తుంది.

## పాత వీడియోలతో కుట్ర.. యాంకర్ స్రవంతి సంచలన వివరణ

యాంకర్ స్రవంతి చొక్కరపు తాజాగా ఒక వివాదంపై ఘాటుగా స్పందించారు. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఆమెకు సంబంధించి ఒక 'బెట్టింగ్ యాప్' ప్రమోషన్ వీడియో తెగ వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తుండటంతో, ఆమె స్వయంగా రంగంలోకి దిగి అసలు విషయాన్ని బయటపెట్టారు. సదరు వీడియోపై క్లారిటీ ఇస్తూ.. అది ఇప్పటిది కాదని, చాలా కాలం క్రితం చేసిన పాత ప్రమోషన్ అని స్రవంతి స్పష్టం చేశారు. "ఆ సమయంలో నాకు వీటిపై సరైన అవగాహన లేదు. తెలియకుండా చేసిన తప్పు అది. కానీ ఇప్పుడు కావాలనే ఆ పాత వీడియోను మళ్ళీ వైరల్ చేస్తున్నారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఫాలోయింగ్ కోసం లేదా కావాలనే కొందరు వ్యక్తులు ఈ పాత అంశాన్ని తెరపైకి తెస్తున్నారని ఆమె అభిప్రాయపడ్డారు.ఈ వివాదంపై స్రవంతి మరింత లోతుగా స్పందిస్తూ, ఈ ఇష్యూ ఎప్పుడో సర్దుమణిగిందని తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను, వివరణను ఇప్పటికే సంబంధిత అధికారులకు సమర్పించినట్లు వెల్లడించారు. చట్టపరంగా చేయాల్సిన ప్రతి పనిని పూర్తి చేశానని, ఇప్పుడు కొత్తగా దీనిపై చర్చించాల్సిన అవసరం లేదని ఆమె తేల్చి చెప్పారు. తన అభిమానులకు , సామాన్య ప్రజలకు స్రవంతి ఒక ముఖ్యమైన విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆ పాత వీడియోలను చూసి మోసపోవద్దని కోరారు. ఆ వీడియో ఎక్కడ కనిపించినా వెంటనే 'రిపోర్ట్' చేయమని విన్నవించారు. తెలుపుతూ చేతులు జోడించారు.



## దర్శకులు అలా రాయడమే గొప్ప పురస్కారం


దర్శకులు మిమ్మల్ని దృష్టిలో పెట్టుకుని స్క్రిప్ట్‌లు రాశామని చెప్పడమే అతి పెద్ద అవార్డు అంటోంది కథానాయిక మృణాల్ ఠాకూర్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె హిందీ చిత్రసీమ వెలుపల గుర్తింపు పొందడం గురించి పలు ఆసక్తికరమైన సంగతుల్ని పంచుకుంది. "చిత్రపరిశ్రమలో నేను ఒక్కో మెట్టు ఎక్కుతూ వస్తున్నాను. బహుశా ఇండస్ట్రీ తొలినాళ్లలో నటన పరంగా నేను రెడీగా లేనేమో. కానీ, ఇప్పుడు నేను పూర్తిగా సిద్ధంగా ఉన్నాను. మిమ్మల్ని దృష్టిలో పెట్టుకుని స్క్రిప్ట్ రాశామని దర్శకులు చెప్పడమే నాకు దక్కిన అతిపెద్ద పురస్కారం. నిజమే నేను చేసిన మొదటి తెలుగు సినిమా 'సీతారామం' బ్లాక్ బస్టర్ అయింది. దాంతో నటిగా నాకు దక్షిణాదిలో మంచి గుర్తింపు దొరికింది. ఆ విధంగానే ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందాను. ఇప్పుడు నేను చేస్తున్న 'డెకాయిట్' చిత్రాన్ని తెలుగు, హిందీలో తెరకెక్కిస్తున్నారు. ముందుగా సన్నివేశాల్ని హిందీలో రిహార్సల్ చేయాలనుకునేదాన్ని. ఇప్పుడీ విషయంలో కొంచెం మెరుగుపడ్డాన"ని చెప్పుకొచ్చింది. త్వరలోనే 'డెకాయిట్' చిత్రంలో అడివి శేష్ సరసన తెరపై సందడి చేయడానికి సన్నద్ధమవుతుంది మృణాల్.





## శర్వానంద్‌కు మరో సెంటిమెంట్ యాడయ్యిందా?..

ఛార్మింగ్ స్టార్ శర్వానంద్‌కు సంక్రాంతి సెంటిమెంట్ బాగా వర్కౌటౌతోంది. పొంగల్‌కు వచ్చిన ప్రతిసారి హిట్ కొడుతున్నాడు. నెక్స్ట్ పండుగకు కూడా ప్లాన్ చేసుకుంటున్నాడు. అయితే 'బైకర్' పండుగకు రాకపోయినా.. బంపర్ బ్లాక్ బస్టర్ కొట్టబోతున్నానని కాన్ఫిడెన్స్‌గా చెబుతున్నాడు శర్వా. ఆ కాన్ఫిడెన్స్‌కు కంటెంట్‌పై నమ్మకమా? లేదా మరో సెంటిమెంటా?.
సంక్రాంతికి వచ్చిన ప్రతిసారి శర్వానంద్ సక్సెస్ టేస్ట్ చేస్తున్నాడు. 2016లో సంక్రాంతికి వచ్చిన 'ఎక్స్ ప్రెస్ రాజా' హిట్టుగా నిలిస్తే.. 2017లో పొంగల్‌కు రిలీజైన 'శతమానం భవతి' బ్లాక్ బస్టర్ హిట్ అయింది. తాజాగా వచ్చిన 'నారీ నారీ నడుమ మురారి' కూడా డీసెంట్ హిట్ అందుకుంది. సో ఛార్మింగ్ స్టార్‌కు పండుగ ఓ సెంటిమెంట్‌గా మారింది. నెక్స్ట్ శ్రీను వైట్లతో కలిసి 2027 సంక్రాంతిని టార్గెట్ చేస్తున్నాడు శర్వా.
సంక్రాంతికి హిట్ కొట్టిన శర్వానంద్.. 'బైకర్'తో ఏప్రిల్ 3న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. బైక్ రైసర్ పాత్రలో ఒదిగిపోయాడు ఛార్మింగ్ స్టార్. దేశం మొత్తం మాట్లాడుకునే మూవీ తీశామన్న శర్వా.. 'నారీ నారీ నడుమ మురారికి చెప్పి మరీ హిట్ కొట్టా. ఇప్పుడీ సినిమాతో బంపర్ బ్లాక్ బస్టర్ హిట్ కొడతా' అని చెబుతున్నాడు. ఈసారి పొంగల్ సెంటిమెంట్ లేకపోయినా.. కంటెంట్‌పై నమ్మకంతో కాన్ఫిడెన్స్‌గా స్టేట్ మెంట్ పాస్ చేశాడు.Movies
శర్వానంద్ బైకర్ పొంగల్ సెంటిమెంట్ మిస్సైనా.. యువీ ప్రొడక్షన్స్ రూపంలో మరో సెంటిమెంట్ యాడయ్యింది. యువీ నిర్మాణ సంస్థలో శర్వా త్రీ ఫిల్మ్ చేశాడు. రన్ రాజా రన్, ఎక్స్ ప్రెస్ రాజా, మహానుభావుడు చిత్రాలు రాగా.. మూడు మంచి హిట్స్ అందుకున్నాయి. బైకర్ యువీతో ఫోర్త్ మూవీ రాబోతోంది. ఈ సెంటిమెంట్ బైకర్ విషయంలో వర్కౌట్ అయితే.. మరో బ్లాక్ బస్టర్ శర్వా ఖాతాలో పడినట్లే. చూడాలి మరి ఏం జరుగుతుందో.



## డబ్బులు ఎగ్గొట్టేందుకు కట్టు కథ చెప్పిన స్టార్ డైరెక్టర్..

మణిరత్నం తర్వాత క్లాసికల్ లవ్ స్టోరీలతో పాపులరైన గౌతమ్ వాసు దేవ్ మీనన్ లైఫ్‌లో బ్యాడ్ ఫేజ్ నడుస్తోంది. చియాన్ విక్రమ్‌తో తీసిన సినిమా 'ధ్రువ నక్షత్రం' రిలీజ్ పెండింగ్‌లో ఉండగా.. తీసిన సినిమాలు బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడ్డాయి. ఇక మెగా ఫోన్‌కు కాస్త గ్యాప్ ఇచ్చి యాక్టింగ్ వైపు యూటర్న్ తీసుకున్నాడు. ఆయన కీ రోల్ చేసిన 'కార్మెనీ సెల్వం' రిలీజ్ అవుతున్న సమయంలో గౌతమ్ మీనన్‌కు మద్రాస్ హైకోర్టు బిగ్ షాక్ ఇచ్చింది.
2008 నాటి కేసు తాజాగా గౌతమ్ మీనన్ మెడకు చుట్టుకుంది. తన నిర్మాణ సంస్థ ఫోటాన్ ఫ్యాక్టరీ, ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్‌తో కలిసి గతంలో ఓ సినిమా చేయాలనుకున్నారు. ఆ సంస్థ నుంచి 4. 25 కోట్లు విడతల వారిగా తీసుకున్నారు. 2009లో మూవీ కంప్లీట్ చేయాల్సి ఉండగా.. అసలు మొదలే కాలేదు. తీసుకున్న డబ్బులు ఇవ్వకపోడంతో ఆర్ఎస్ సంస్థ కోర్టును ఆశ్రయించింది. సింగిల్ బెంచ్ ఈ సంస్థకు అనుకూలంగా తీర్పు ఇస్తే.. సవాల్ చేస్తూ గౌతమ్ మీనన్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించాడు. అలాగే డబ్బులు ఎగ్గొట్టేందుకు కోర్టుకు కట్టు కథలు కూడా చెప్పాడు.

## కొత్త కబురు వినిపిస్తారా?

గతేడాది 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించారు కథానాయకుడు రామ్‌పోతినేని. ఆ తర్వాత మళ్లీ ఇంతవరకు కొత్త కబురేమీ వినిపించలేదు. అయితే ఇప్పుడీ అంశంపై స్పష్టత వస్తున్నట్లు తెలుస్తోంది. రామ్ ఈసారి ఓ భారీ యాక్షన్ థ్రిల్లర్‌తో ప్రేక్షకుల్ని పలకరించనున్నట్లు సమాచారం. దర్శకుడు లోకేశ్ కనగరాజ్ శిష్యుడు లోగి విఘ్నేశ్ దీనికి దర్శకత్వం వహించే అవకాశమున్నట్లు తెలిసింది. ఈ ప్రాజెక్ట్ చర్చలు ప్రస్తుతం తుది దశలో ఉన్నాయని.. నిర్మాణ సంస్థపై స్పష్టత రాగానే దీన్ని అధికారికంగా ప్రకటించనున్నారని వార్తలొస్తున్నాయి.

